ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక



సంపుటి: 6 సంచిక: 135, పేజీలు - 08

సోమవారం, నవంబర్ 16, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

కరువు కష్టాల నుంచి గట్టెక్కించండి

– తెలంగాణకు రూ.30 వేల కోట్ల ప్యాకేజీ ఇవ్వండి

- ప్రధాని మోదీతో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ
- ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు
- 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం
- తుమ్మిడిహెట్టి, సమ్మక్కసాగర్, సీతమ్మసాగర్ ప్రాజెక్టులపై వినతులు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో నెలకొన్న కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే రూ.30 వేల కోట్ల ఆర్థిక ప్యాకేజీ కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆదివారం లోక్ కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసంలో మోదీతో సీఎం కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు, కేంద్ర నిధుల కేటాయింపుపై ప్రధానితో చర్చించారు. తెలంగాణ అవసరాలను వివరిస్తూ పలు కీలక ప్రతిపాదనలు, వినతులను ఆయన ముందుంచారు.

365 మండలాల్లో కరువు పరిస్థితులు

ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఆశించిన స్థాయిలో వర్షాలు

2లో..

మావోయిస్టుల హింసాకాండతో

ఆదివాసీలు నష్టపోయారు

– బిర్సా ముండా 151వ జయంతిలో మోదీ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) మావోయిస్టుల హింసాకాండ వల్ల ఆదివాసీలు నష్టపోయారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గత ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా వారిని గాలికొదిలేశాయని ఆరోపించారు. నక్సలైట్లు గిరిజనుల ఓటు హక్కును సైతం కాలరాసినా నాటి పాలకులు చోద్యం చూస్తూ ఉండిపోయారని విమర్శించారు. స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా 151వ జయంతి సందర్భంగా మహారాష్ట్ర గడ్చిరోలిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని వర్చువల్‌గా ప్రసంగించారు. 3వేల కోట్ల రూపాయల విలువైన 246 అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. దశాబ్దాలుగా కనీస వసతులకు నోచుకోని గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై తమ ప్రభుత్వం

2లో..

రాహుల్‌కు సీఎం బాడీగార్డ్..

మంత్రులు నౌకర్లు

- కాంగ్రెస్, బీజేపీ నేతల తీరుపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- రాహుల్ బైక్ వెనుక మంత్రుల పరుగులపై ఆగ్రహం
- తెలంగాణ పునాది ఆత్మగౌరవమేనని వ్యాఖ్య



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రం ఆత్మగౌరవ ప్రాతిపదికన ఏర్పడిందని, అయితే కాంగ్రెస్, బీజేపీ వంటి జాతీయ పార్టీలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ఏమాత్రం అర్థం చేసుకోవడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శనివారం హైదరాబాద్‌లో పాల్గొన్న కార్యక్రమాల సందర్భంగా ముఖ్యమంత్రి, మంత్రులు వ్యవహరించిన తీరుపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్, బీజేపీ నాయకత్వాలపై విమర్శలు గుప్పించారు. తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నేతలకు పదవుల హుందాతనం, గౌరవం తెలియకుండా పోయాయని కేటీఆర్ మండిపడ్డారు. గాంధీ కుటుంబం ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక బాడీగార్డులా

2లో..

1950 తర్వాత అత్యంత తీవ్రమైన ఎల్‌నినో

- 2027 వరకు ప్రపంచానికి తప్పని ముప్పు!



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రపంచ వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే ఎల్‌నినో మరింత బలపడుతోంది. 1950 తర్వాత ఇదే అత్యంత శక్తిమంతమైన ఎల్‌నినోగా మారనుందని, దీని ప్రభావం 2027 మార్చి వరకు కొనసాగవచ్చని అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్‌వోఏఏ) తాజాగా హెచ్చరించింది. ఈ పరిణామం ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ సరళిలో భారీ మార్పులకు కారణం

2లో..

తుఫాన్ల ముప్పు..

కేంద్రం చేయూత కావాలి

– తక్షణ సాయం కోరిన సీఎం చంద్రబాబు



అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీని వణికించిన మురసు తుఫాన్ మిగిల్చిన తీవ్ర నష్టాన్ని అంచనా వేసేందుకు రాష్ట్రానికి విచ్చేసిన కేంద్ర బృందం తమ పర్యటనను ముగించింది. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించిన ఈ టీమ్ సభ్యులు ఆదివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడితో వర్చువల్ విధానంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కేంద్ర బృందం సభ్యులు రాష్ట్రంలో మురసు తుఫాన్ క్రియేట్ చేసిన బీభత్సం కారణంగా వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, విద్యుత్ వ్యవస్థలు తదితర రంగాలపై పడిన తీవ్ర ప్రభావాన్ని సీఎంకు వివరించారు. క్షేత్రస్థాయిలో తాము గమనించిన విషయాలను పంచుకున్నారు. అలాగే అపారమైన పంట నష్టం, రహదారులు, బిల్డింగ్స్, ఇతర మౌలిక వసతులు తీవ్రంగా దెబ్బతిన్న పరిస్థితులను తాము పరిశీలించామని తెలియజేశారు.

సమగ్ర నివేదిక అందజేత..

ఈ వర్చువల్ మీటింగ్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రాథమికంగా జరిగిన నష్ట అంచనాలతో కూటిన రిపోర్ట్‌ను అధికారులు కేంద్ర

2లో..

టీడీపీ మున్సిపల్, మేయర్ అభ్యర్థులు ఖరారు

– మంగళగిరి-తాడేపల్లి బరిలో నిలిచిందెవరు.?

అమరావతి (ప్రశ్న న్యూస్) కోర్టు వివాదాలు కారణంగా ఇన్ని రోజులు పెండింగ్‌లో ఉన్న 23 మున్సిపల్, కార్పొరేషన్, నగర పంచాయతీల ఎన్నికలకు సంబంధించి తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తన అభ్యర్థుల లిస్ట్‌ను వెల్లడించింది. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మేయర్, మున్సిపల్ చైర్మన్, నగర పంచాయతీ ఛైర్మన్ స్థానాలకు అభ్యర్థులను అధికారికంగా ఖరారు చేయడం జరిగింది. క్షేత్రస్థాయిలో పార్టీ, అభ్యర్థుల బలాబలాలు, గెలిచే అవకాశాలు, సామాజిక సమీకరణాలను కూడా పరిగణలోకి తీసుకుని ఫైనల్ జాబితాను రూపొందించినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా కీలకమైన మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా పేరం ఏడుకొండలు పేరును అధిష్టానం ఫిక్స్ చేసింది.

మున్సిపల్ చైర్మన్ అభ్యర్థులు వీళ్లే..

రాష్ట్రంలో పలు కీలక మున్సిపాలిటీలకు సైతం తెలుగు దేశం నాయకత్వం అభ్యర్థులను కూడా ప్రకటించింది. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మున్సిపాలిటీకి బసవ రామకృష్ణ, పాలకొల్లుకు ఆబోతుల

2లో..

12ఏళ్లలో మోదీపై అవినీతి ఆరోపణ కూడా లేదు

– కాంగ్రెస్‌పై అమిత్‌షా తీవ్ర విమర్శలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ లక్ష్యంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలను ఉద్దేశిస్తూ అమిత్ షా తీవ్ర విమర్శలు చేశారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ పరువును రాహుల్ గాంధీ తీస్తున్నారని మండిపడ్డారు. విదేశాల్లో భారత గౌరవాన్ని కించపరిస్తే కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ అధికారంలోకి రాదని ఎద్దేవా చేశారు. ప్రపంచ వ్యాప్తంగా అత్యంత జనాదరణ కలిగిన వ్యక్తి ప్రధాని నరేంద్ర మోదీ అని.. ఆయన గౌరవాన్ని తగ్గించేలా రాహుల్ గాంధీ ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. ఆదివారం పూణేలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."మీకు అధికారం కావాలంటే వెంటనే విదేశీ పర్యటనలను ఆపేసి గ్రామాల్లో పర్యటించండి. అలా చేయడం వల్ల ఎప్పుడో ఓసారి మీరు అధికారంలోకి వచ్చే అవకాశం ఉంటుంది. కానీ రాహుల్ గాంధీ నా మాట ఎప్పుడూ వినరు. అయితే కాంగ్రెస్ కార్యకర్తలకు చెప్పేది ఒక్కటే.. మీరంతా ఆయన మార్గంలోనే వెళ్తే ఇంకో 30 ఏళ్లు అయినా

2లో..

మరణశిక్ష రద్దుకు భారత్‌నో

– ఐరాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం (యూఎన్‌జీఏ) థర్డ్ కమిటీలో మరణశిక్షల అమలుపై ప్రపంచవ్యాప్త తాత్కాలిక నిషేధం విధించాలంటూ ప్రవేశపెట్టిన ముసాయిదా తీర్మానానికి వ్యతిరేకంగా భారత్ ఓటు వేసింది. మెక్సికో ప్రతిపాదించిన ఈ తీర్మానానికి అనుకూలంగా 133 దేశాలు ఓటు వేయగా, భారత్‌తో సహా

2లో..

'ఓట్ చోర్'...'సంవిధాన్ చోర్'

కాంగ్రెస్ పార్టీయే

– హైదరాబాద్ వేదికగా భారత్ ప్రతిష్ఠకు మచ్చ - రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలన్న బీజేపీ చీఫ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ వేదికగా కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'భారత్ సమ్మిట్'పై రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. దేశ వ్యతిరేక శక్తులను హైదరాబాద్‌కు రప్పించి దేశ ప్రతిష్ఠను దెబ్బతీశారని, ప్రజలకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పెట్టుబడుల సదస్సు పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేవలం కాంగ్రెస్ కార్యకర్తలే ఉన్నారని, గిగ్ వర్కర్లు ఎవరూ కనిపించలేదని ఆయన ఆరోపించారు. భారత అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో విదేశీయులు జోక్యం చేసుకోవడాన్ని రాంచందర్ రావు తప్పుబట్టారు. ఇటలీ ప్రతినిధి భారత ప్రజాస్వామ్యంపై వ్యాఖ్యలు చేయడం దేశ సార్వభౌమాధికారాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ విదేశాల్లో దేశ ఆర్థిక వ్యవస్థపై విమర్శలు చేయడంతో పాటు,

2లో..

తీవ్ర తుపానుగా బలపడనున్న

వాయుగుండం

- ఏపీ, ఒడిశాలకు తుపాను హెచ్చరికలు జారీ - 20 రోజుల వ్యవధిలో మూడో ముప్పు!
- మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దన్న అధికారులు



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాలకు వాతావరణ శాఖ తుపాను హెచ్చరికలు జారీ చేసింది. ఆగ్నేయ, దానిని ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడి తీవ్ర తుపానుగా మారే అవకాశముందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఇది ప్రస్తుతం ఉత్తర-వాయవ్య దిశగా గంటకు 15 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ఐఎండీ విడుదల చేసిన బులెటిన్ ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం సమయానికి ఈ వాయుగుండం విశాఖపట్నానికి ఆగ్నేయంగా 960 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 1070 కిలోమీటర్లు, చెన్నైకి తూర్పు-ఆగ్నేయంగా 800 కిలోమీటర్ల

2లో..

కరువు కష్టాల నుంచి గట్టెక్కించండి

కురవకపోవడంతో అనేక ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని సీఎం రేవంత్ రెడ్డి ప్రధానికి వివరించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన విషయాన్ని ప్రస్తావించారు. వర్షాభావం కారణంగా వ్యవసాయం, తాగునీరు, సాగునీటి అవసరాలపై తీవ్ర ప్రభావం పడుతోందని తెలిపారు. రైతులను ఆదుకోవడంతో పాటు కరువు నివారణ చర్యలు చేపట్టేందుకు కేంద్రం వెంటనే రూ.30 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల తీవ్రతను పరిగణనలోకి తీసుకుని కేంద్రం ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులివ్వండి

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ప్రాణహిత నదిపై 152 మీటర్ల ఎత్తుతో నిర్మించ తలపెట్టిన తుమ్మిడిహెట్టి బ్యారేజీకి అవసరమైన కేంద్ర అనుమతులతో పాటు నిధులను త్వరగా మంజూరు చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు మహారాష్ట్ర ప్రభుత్వ సమ్మతి లభించేలా కేంద్రం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అనుమతులు ఇప్పించాలని, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) వచ్చేలా సహకరించాలని కోరారు. సీతమ్మసాగర్ బ్యారేజీకి పర్యావరణ అనుమతులు లభించేలా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గోదావరి-కావేరి అనుసంధానంలో 50 శాతం వాటా

గోదావరి–కావేరి నదుల అనుసంధాన అంశాన్ని సైతం సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని వద్ద ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టును సమ్మక్కసాగర్ లేదా ఇచ్చంపల్లి నుంచి చేపట్టాలని ప్రతిపాదించారు. గోదావరి నదుల అనుసంధాన ద్వారా తరలించే నీటిలో తెలంగాణకు 50 శాతం వాటా కేటాయించాలని కోరినట్లు సమాచారం. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో రాష్ట్రానికి దక్కాల్సిన న్యాయమైన వాటాను సాధించేందుకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సాగునీటి అవసరాలు, అంతర్రాష్ట్ర సమస్యల కారణంగా ప్రాజెక్టుల నిర్మాణంలో ఎదురవుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి, మంత్రులు ప్రధానికి వివరించారు.

గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ఆహ్వానం

తెలంగాణలో త్వరలో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలకు హాజరుకావాలని ప్రధాని మోదీని సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని కోరారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు వివరించారు. అలాగే డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ప్రధానికి ఆహ్వానం అందించారు. ఈ క్రీడా పోటీలు రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధికి దోహదపడతాయని వివరించారు.

ఢిల్లీలో ఇతర కార్యక్రమాలకు సీఎం హాజరు

ప్రధాని మోదీతో సమావేశం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో మరికొన్ని కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అనంతరం ప్రముఖ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కుమారుడి వివాహ రిసెప్షన్‌లో పాల్గొననున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలతోనూ సీఎం సమావేశమయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

మావోయిస్టుల హింసాకాండతో ఆదివాసీలు నష్టపోయారు

ప్రత్యేక దృష్టి సారించిందని మోదీ తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రగతి కోసం లక్ష కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. గిరిజన వర్గాలు ఎల్లప్పుడూ అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడ్డాయని ప్రశంసించారు. దేశంలో 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడం, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత్ సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటని అన్నారు.

బిర్సా ముండా జయంతికి దేశవ్యాప్తంగా 2 లక్షలకు పైగా కార్యక్రమాలు

'జనజాతీయ గౌరవ్ దివస్' అనేది గిరిజన సమాజం గౌరవానికి, గిరిజన నాయకుడు బిర్సా ముండా అందించిన స్ఫూర్తికి సంబంధించిన పండుగ అని ప్రధాని మోదీ అభివర్ణించారు. "2021 నవంబర్ 15 నుంచి 'జనజాతీయ గౌరవ్ దివస్' (గిరిజన గౌరవ దినోత్సవం) జరుపుకొంటున్నాం. నేడు ఇది ఒక జాతీయ వేడుకగా మారింది. గతేడాది భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా 2 లక్షలకు పైగా కార్యక్రమాలు జరిగాయి. వీటిలో కోట్ల మంది పౌరులు పాల్గొన్నారు. ఒకప్పుడు అనేక పండుగలు, సందర్భాలు విదేశీ దృక్కోణం నుంచి నిర్ణయించేవారు. కానీ నేడు, భారతదేశం తన వారసత్వాన్ని, చరిత్రను, వీరులను స్వదేశీ గర్వంతో స్మరించుకుంటోంది. ఇది మన జాతీయ చైతన్యంలో వచ్చిన ఒక పెద్ద మార్పునకు సంకేతం." అని ప్రధాని మోదీ అన్నారు. భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నవంబర్ 15న జనజాతీయ గౌరవ్ దివస్‌ను పాటిస్తారు. 1875లో గిరిజన సమాజంలో జన్మించిన బిర్సా ముండా, బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన గిరిజన ప్రతిఘటనలో ప్రముఖ నాయకుడిగా ఎదిగారు.

రాహుల్‌కు సీఎం బాడీగార్డ్.. మంత్రులు నౌకర్లు

వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు సైతం రాహుల్ గాంధీ బైక్ వెనుక నౌకర్ల మాదిరిగా పరుగులు తీయడం ఏమిటని ప్రశ్నించారు. గిగ్ వర్కర్లతో కలిసి రాహుల్ గాంధీ నిర్వహించిన బైక్ ర్యాలీ దృశ్యాలను ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

బీజేపీ నేతలపైనా విమర్శలు

కాంగ్రెస్‌తో పాటు బీజేపీ రాష్ట్ర నాయకత్వం తీరుపైనా కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. గతంలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అమిత్ షా కాళ్లకు మొక్కడం, ఆయన చెప్పులు మోయడం వంటి ఘటనలను గుర్తుచేశారు.

ఇలాంటి చర్యలు అత్యంత సిగ్గుచేటని, అనుచితమైన ప్రవర్తనగా అభివర్ణించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్, బీజేపీ వంటి రెండు జాతీయ పార్టీలు ఏనాడూ గౌరవించలేవని విమర్శించారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో రాహుల్ పాల్గొనడంపై అభ్యంతరం

ఇదిలా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అధికారిక కార్యక్రమాల్లో రాహుల్ గాంధీ పాల్గొనడంపై బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని నీతులు చెబితే సరిపోదని, ముందుగా రాజ్యాంగ విలువలను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికింది. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రారంభించేందుకు రాహుల్ గాంధీకి ఏ హోదా కల్పించారని, ఏ ప్రొటోకాల్ ప్రకారం ఆయన ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారని ప్రశ్నించింది. శనివారం రాహుల్ గాంధీ గిగ్ వర్కర్ల సంక్షేమ ప్యాకేజీని ప్రకటించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'భారత్ సమ్మిట్' ముగింపు సభలో ప్రసంగించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ఆయన భాగస్వామ్యం కావడంపై బీఆర్ఎస్ పార్టీ పలు ప్రశ్నలు సంధించింది.

1950 తర్వాత అత్యంత తీవ్రమైన ఎల్‌నినో

కానుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఎల్‌నినో కారణంగా భూమధ్యరేఖ వెంబడి పసిఫిక్ మహాసముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణ స్థాయిలో వేగంగా పెరుగుతున్నాయి. ఈ పెరుగుదల గతంలోని అన్ని రికార్డులను బద్దలు కొట్టనుందని ఎన్‌వోఏఏ తన నివేదికలో స్పష్టం చేసింది. ఈ ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా వర్షపాతంలో తీవ్ర వ్యత్యాసాలు చోటుచేసుకుంటాయి. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించనుండగా, మరికొన్ని ప్రాంతాల్లో తీవ్ర కరవు పరిస్థితులు నెలకొంటాయని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

అంతేకాకుండా, ప్రపంచవ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రతలు పెరగడం, అడవుల్లో కార్చిచ్చులు అధికమవడం వంటి పరిణామాలు కూడా సంభవిస్తాయి. ఎన్‌వోఏఏ, ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) నివేదికల ప్రకారం, ఎల్‌నినో తీవ్రత క్రమంగా పెరుగుతూనే ఉంది. ముఖ్యంగా 2027 జనవరి నుంచి మార్చి మధ్య కాలంలో ఇది అత్యంత బలమైన స్థాయిలో కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో వివిధ దేశాలు వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

తుఫాన్ల ముప్పు..కేంద్రం చేయూత కావాలి

బృందానికి అందజేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం మురసు తుఫాన్ వల్ల రాష్ట్రవ్యాప్తంగా మొత్తం రూ.2,484 కోట్ల మేర భారీ ఆర్థిక నష్టం వాటిల్లినట్టు ఈ రిపోర్ట్‌లో స్పష్టం చేయడం జరిగింది.

బాధితులకు తక్షణమే ఆదుకోవాలి : సీఎం చంద్రబాబు

మురసు తుఫాన్ ప్రభావానికి నష్టపోయిన రైతులు, బాధిత కుటుంబాలను తక్షణమే ఆదుకోవాల్సిన అవసరం ఉందని కచ్చితంగా చెప్పారు. దెబ్బతిన్న ప్రాంతాల్లో పునరావాస, పునర్నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు వీలుగా ఎన్డీఆర్ఎఫ్ నుంచి వెంటనే నిధులు రిలీజ్ చేసేలా కేంద్ర ప్రభుత్వానికి తగిన సిఫార్సులు చేయాలని ఆయన టీమ్‌ని కోరారు. బాధితులకు వెంటనే సాయం అందించాలని తెలియజేశారు. కేంద్ర బృందం ఢిల్లీకి చేరుకున్న అనంతరం తమ ఫైనల్ రిపోర్ట్‌ను కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు సబ్మిట్ చేయనుంది. ఆ రిపోర్ట్ ఆధారంగా రాష్ట్రానికి కేంద్రం నుంచి అందే ఆర్థిక సాయంపై స్పష్టత రానుంది. ప్రాథమికంగానే నష్టం వేల కోట్లలో ఉన్నట్టు నిర్ధారణ కావడంతో, త్వరలోనే కేంద్రం నుంచి సానుకూల స్పందన వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది.

'ఓట్ చోర్'...'సంవిధాన్ చోర్'

కాంగ్రెస్ పార్టీయే

ఇప్పుడు విదేశీయులను ఇక్కడికి పిలిపించి దేశానికి వ్యతిరేకంగా మాట్లాడించడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రధాని మోదీని వ్యతిరేకిస్తే సహిస్తాం కానీ, దేశాన్ని వ్యతిరేకిస్తే సహించబోమని రాంచందర్ రావు స్పష్టం చేశారు.నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ భవన్‌లో నిర్వహించిన 'తెలంగాణ బీజేపీ అన్ని విభాగాల (ఆల్ సెల్స్) సమావేశం'లో రాష్ట్ర రాంచందర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పార్టీ నిర్మాణంలో వివిధ సెల్స్ అత్యంత కీలకమని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం వీటి పనితీరుకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో 22 అధికారిక సెల్స్ ఉన్నాయని, రాష్ట్ర స్థాయిలో అవసరాన్ని బట్టి మరో ఐదారు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. వివిధ వృత్తి నిపుణులు, మేధావులను పార్టీతో అనుసంధానించాలని, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా నితిన్ గడ్కరీ, బి.ఎల్. సంతోష్ సూచనల మేరకు ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్‌ను వేగవంతం చేయాలన్నారు. 'సికిందర్' సినిమాలోని దేశభక్తి గీతం స్ఫూర్తితో కల్చరల్ సెల్ సహా అన్ని విభాగాలు ప్రజల్లో జాతీయవాద చైతన్యం నింపాలని ఆయన కోరారు.ఈ సదస్సుకు 350 మంది విదేశీ ప్రతినిధులు రావాల్సి ఉండగా, 115 మంది మాత్రమే హాజరయ్యారని తెలిపారు. భారత వ్యతిరేక వ్యాసాలు రాసిన నార్వే జర్నలిస్టు హెల్లె లింగ్ సహా మిగిలిన వారికి కేంద్రం చివరి నిమిషంలో వీసాల రద్దు సరైన నిర్ణయమని రాంచందర్ రావు సమర్థించారు. గతంలో నరేంద్ర మోదీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు అమెరికా వీసా నిరాకరించాలని 63 మంది కాంగ్రెస్ ఎంపీలు సంతకాలు చేసి ఆ అధ్యక్షుడికి లేఖ రాసిన విషయాన్ని శశిథరూర్, కాంగ్రెస్ నేతలు మర్చిపోయారా అని ప్రశ్నించారు. ప్రపంచవ్యాప్తంగా జాతీయవాద ప్రభుత్వాలను కూల్చివేస్తానని బహిరంగంగా ప్రకటించిన జార్జ్ సోరోస్ నిధులతో నడిచే ప్రోగ్రెసివ్ అలయన్స్, 'ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్' సంస్థల ప్రతినిధులను ఈ సమ్మిట్‌కు రప్పించారని ఆరోపించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఓపెన్ సొసైటీ ఫౌండేషన్స్ మాజీ అధ్యక్షుడు ప్యాట్రిక్ గాస్పర్డ్, ఈక్వెడార్ మాజీ విదేశాంగ మంత్రి గిలోమ్ లాంగ్, స్లోవేనియాకు చెందిన 'ఇన్‌స్టిట్యూట్ 8 మార్చి' వ్యవస్థాపకురాలు – సోరోస్ సంస్థల నుంచి నిధులు పొందినవారు నికా కోవాచ్, డచ్ మాజీ విదేశాంగ మంత్రి బెర్ట్ కోయెందర్స్ వంటి వారంతా జార్జ్ సోరోస్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్నవారేనని ఆరోపించారు. బార్సిలోనాలో జరిగిన గ్లోబల్ ప్రోగ్రెసివ్ మొబిలైజేషన్ తరహాలో, ప్రపంచవ్యాప్తంగా విద్యార్థి ఆందోళనలను ప్రేరేపించి ప్రభుత్వాలను కూల్చేసే కుట్రలతో వీరు భారత్‌లో అశాంతి సృష్టించాలని చూస్తున్నారని హెచ్చరించారు. 2014 తర్వాత భారతదేశంలో ప్రజాస్వామ్యం లేదంటూ రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలను రాంచందర్ రావు తిప్పికొట్టారు. అసలు దేశంలో ఓట్ చోర్, 'సంవిధాన్ చోర్' కాంగ్రెస్ పార్టీయేనని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు అత్యధిక మద్దతు ఉన్నప్పటికీ జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాని కావడం మొదటి ఓటు చోరీ అన్నారు. 1969లో అధికారం కోసం ఇందిరా గాంధీ కాంగ్రెస్ పార్టీని చీల్చారని, 1973లో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులను పక్కనపెట్టి తనకు అనుకూలమైన వారిని నియమించారు. 1975లో ఎమర్జెన్సీ విధించి జయప్రకాష్ నారాయణ్, నానాజీ దేశ్‌ముఖ్, వాజ్‌పేయి, అద్వానీ వంటి లక్షలాది మందిని జైళ్లలో పెట్టి 'కమిటెడ్ జ్యుడీషియరీ, కమిటెడ్ బ్యూరోక్రసీ, కమిటెడ్ ప్రెస్' పేరుతో రాజ్యాంగాన్ని కాలరాశారని విమర్శించారు.బీసీ నాయకుడైన పార్టీ అధ్యక్షుడు సీతారాం కేసరిని అవమానకరంగా గదిలో బంధించి పదవి నుంచి తొలగించిన చరిత్ర ఆ పార్టీదే అన్నారు. గతంలో పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు ఐక్యరాజ్యసమితిలో కాశ్మీర్ అంశంపై భారత్ గొంతు వినిపించడానికి ప్రతిపక్ష నేత అటల్ బిహారీ వాజ్‌పేయిని పంపారని, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ ఏనాడూ విదేశాల్లో దేశ ప్రతిష్ఠను తగ్గించేలా మాట్లాడలేదన్నారు. భారత గడ్డపైకి దేశ వ్యతిరేక శక్తులను తీసుకొచ్చి మన ప్రజాస్వామ్యాన్ని అవమానించినందుకు రాహుల్ గాంధీ దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మిట్‌లో పాల్గొని దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేసిన ప్రతి ఒక్కరిపై బీజేపీ తెలంగాణ తరఫున ఫిర్యాదు చేస్తామని రాంచందర్ రావు స్పష్టం చేశారు.

టీడీపీ మున్సిపల్, మేయర్ అభ్యర్థులు ఖరారు

ఉషారాణి సెలక్ట్ అయ్యారు. రాజకీయంగా ఎంతో ప్రాధాన్యత ఉన్న నరసరావుపేట మున్సిపాలిటీకి ఎన్.రూపేశ్ గుప్తా, గుడివాడకు మారీదు కరుణను పోటీలో ఉండనున్నారు. ఇక శ్రీకాళహస్తి నుంచి పేట బాలాజీ, తాడిగడప నుంచి పీతా గోపీచంద్ బరిలో నిలవనున్నారు. ఇక పొన్నూరులో కంద్రు విజయలక్ష్మి, కందుకూరులో పిడికిటి వెంకటేశ్వర్లు, ఆమదాలవలసలో కూన ప్రమీల, గూడూరులో చౌటూరి శిరీషలకు చైర్మన్ అభ్యర్థులుగా అవకాశం దక్కింది.

నగర పంచాయతీ చైర్మన్ల జాబితా..

మున్సిపాలిటీలతో పాటుగా నగర పంచాయతీ చైర్మన్ స్థానాలకు కూడా పార్టీ అభ్యర్థులను ప్రకటించడం జరిగింది. చింతలపూడికి కె.ఎస్తేర్ రాణి, పొదిలి నగర పంచాయతీకి వరికుంట్ల అనిల్ కుమార్ సెలక్ట్ అయ్యారు. అల్లూరుకు తోటకూర సునీల్ కుమార్, బి.కొత్తపేటకు కుడుము శ్రీనివాసులు పేర్లను టీడీపీ ఖరారు చేసింది.

ఇప్పటికే బీజేపీ పార్టీ కూడా తన పార్టీ అభ్యర్థుల లిస్ట్‌ను రిలీజ్ చేసింది. అభ్యర్థుల ప్రకటనతో రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం ప్రారంభమైంది. టికెట్లు దక్కించుకున్న అభ్యర్థులు, ఆయా ప్రాంతాల్లోని పార్టీ శ్రేణులు ఇప్పటికే ప్రచార కార్యక్రమాలకు సిద్ధమవుతున్నారు. అభివృద్ధి అజెండాతో ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రణాళికలు రెడీ చేసుకుంటున్నారు. తొలి విడత స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రధాన పార్టీల మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. కూటమి అభ్యర్థులు మంచి విజయం సాధించారు.

తీవ్ర తుపానుగా బలపడనున్న వాయుగుండం

దూరంలో కేంద్రీకృతమై ఉంది. అలాగే శ్రీలంకలోని త్రింకోమలీకి ఈశాన్యంగా 620 కిలోమీటర్లు, అండమాన్ నికోబార్ దీవులలోని శ్రీ విజయపురానికి పశ్చిమ-నైరుతి దిశలో 680 కిలోమీటర్ల దూరంలో ఉంది.ఈ వాయుగుండం నేటికి మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

ఆ తర్వాత మంగళవారం (నవంబర్ 17) నాటికి పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా రూపాంతరం చెందే అవకాశం ఉంది. అనంతరం వాయవ్య దిశగా పయనిస్తూ మరో రెండు రోజుల్లో, అంటే గురువారం నాటికి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకువస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ తీవ్ర తుపాను ప్రభావం ప్రధానంగా కోస్తాంధ్రపై ఉండే అవకాశముందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. దీనివల్ల గురు, శుక్రవారాల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ తెలిపారు. మంగళవారం వరకు కోస్తా తీరం వెంబడి గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, మత్స్యకారులు ఎట్టిపరిస్థితుల్లోనూ సముద్రంలోకి వేటకు వెళ్లరాదని స్పష్టం చేశారు. రైతులు, తీరప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.గడచిన 20 రోజుల వ్యవధిలోనే బంగాళాఖాతంలో ఏర్పడి ఏపీ తీరం వైపు వస్తున్న మూడో తుపాను ఇది కావడం గమనార్హం. అక్టోబర్ 27న అత్యంత తీవ్ర తుపాను 'అర్నాబ్' నరసాపురం సమీపంలో తీరం దాటగా, ఆ వెంటనే నవంబర్ 3న తీవ్ర తుపాను 'మురసు' నెల్లూరు-నరసాపురం మధ్య తీరాన్ని తాకింది. వారం వ్యవధిలోనే వచ్చిన ఈ రెండు తుపాన్ల కారణంగా 15 మంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు తీరప్రాంత జిల్లాల్లో పంటలు, మౌలిక వసతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇప్పుడు మరో తీవ్ర తుపాను ముంచుకొస్తుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమై ముందస్తు చర్యలు చేపట్టింది.

12ఏళ్లలో మోదీపై అవినీతి ఆరోపణ కూడా లేదు

మీకు అధికారం దక్కదు" అని అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈమేరకు రాహుల్ గాంధీ రాజకీయాల వల్ల కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని విమర్శించారు.అయితే అంతకుముందు హైదరాబాద్ లో జరిగిన భారత్ సమిట్ 2026లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. 2014లోనే భారత ప్రజాస్వామ్యం ధ్వంసమైందని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయని కేంద్ర ప్రభుత్వంపై కీలక ఆరోపణలు చేశారు. ఈ క్రమంలోనే తాజాగా అమిత్ షా దీనికి కౌంటర్ ఇచ్చారు. భారత్ సమిట్ అనే పేరుతో నిర్వహించిన ఈ సమావేశంలో దేశానికి వ్యతిరేకంగా మాట్లాడారని ఈ మీటింగ్ లో రాహుల్ గాంధీ భారత వ్యతిరేక అభిప్రాయాలను వ్యక్తం చేశారని అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో 12 లక్షల కోట్ల స్కామ్ లు జరిగాయని అమిత్ షా మండిపడ్డారు. అందుకే ప్రజలు ఆ పార్టీని అధికార పీఠం నుంచి దూరం పెట్టారని స్పష్టం చేశారు. అయితే ప్రధాని మోదీ గత 12 ఏళ్లుగా పాలిస్తున్నారని ఆయనపై ఇప్పటివరకూ నాలుగు అణాల ఆరోపణ కూడా నమోదు కాలేదని అమిత్ షా పేర్కొన్నారు.

మరణశిక్ష రద్దుకు భారత్‌నో

33 దేశాలు వ్యతిరేకించాయి. మరో 16 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయని ది హిందూ కథనం పేర్కొంది. న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఐరాసలోని భారత శాశ్వత మిషన్ ఫస్ట్ సెక్రటరీ భవిక మంగళానందన్ దేశ వైఖరిని స్పష్టం చేశారు. మరణశిక్షలకు సంబంధించి ప్రపంచ దేశాల మధ్య ఎలాంటి ఏకాభిప్రాయం లేదని ఆమె పేర్కొన్నారు. ప్రతి సార్వభౌమ దేశానికి తమ సొంత న్యాయ వ్యవస్థను, తగిన శిక్షలను నిర్ణయించుకునే పూర్తి హక్కు ఉంటుందని తెలిపారు. భారత్‌లో సరైన న్యాయ ప్రక్రియను, విస్తృతమైన రక్షణలను అనుసరించిన తర్వాతే కేవలం "అత్యంత అరుదైన కేసుల్లో" (రేరెస్ట్ ఆఫ్ రేర్) మాత్రమే మరణశిక్ష విధిస్తామని ఆమె వివరించారు. చట్టబద్ధమైన విచారణ అనంతరం విధించే మరణశిక్షను అన్యాయమైన హత్యలతో లేదా హింసతో పోల్చడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని భారత్ స్పష్టం చేసింది. ఈ తీర్మానాన్ని భారత్‌తో పాటు అమెరికా, చైనా, జపాన్, పాకిస్థాన్, ఇరాన్, సౌదీ అరేబియా వంటి దేశాలు కూడా వ్యతిరేకించాయి. తమ దేశ చట్టాలకు లోబడి, న్యాయ సమీక్షల ద్వారానే తీవ్రమైన నేరాలకు శిక్షలు అమలు చేస్తామని భారత్ మరోసారి తేల్చిచెప్పింది.

సదరు ఉత్సవాలు ఐక్యతకు నిదర్శనం

- కాంగ్రెస్ నేత గరిసెల సురేందర్ ముదిరాజ్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ సర్కిల్ గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధి గౌడవల్లి లో టీం బ్రదర్స్ నీరజ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవానికి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ ఫోరం మాజీ అధికార ప్రతినిధి మాజీ సర్పంచ్ గరిసెల సురేందర్ ముదిరాజ్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం అధ్యక్షుడు గువ్వ రవి ముదిరాజ్ తో కలిసి హాజరై ప్రారంభించారు. అనంతరం సురేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ యాదవ సోదరులు ఇలాంటి సదర్ ఉత్సవాలు జరుపుకోవడం ఐక్యతకు నిదర్శనం అని అన్నారు. ఓ బి సి సెల్ జిల్లా అధ్యక్షులు గువ్వ రవి ముదిరాజ్ మాట్లాడుతూ సదర్ ఉత్సవాలను నిర్వహించిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. సదర్ ఉత్సవాల్లో ఐక్యతను చాటిచెబుతాయని గువ్వ రవి ముదిరాజ్ పేర్కొన్నారు. మాజీ ఉపసర్పంచ్ అప్పల పెంటమ్మ యాదవ్, మల్లిగా హరీష్, టీం నీరజ్ యాదవ్, సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

టైక్వాండో పోటీల్లో మళ్ళి కే డి ఆర్ బ్లిట్జ్ అకాడమీ సంచలన విజయాలు

- టైక్వాండో పోటీల్లో మళ్ళి కె డి ఆర్ అకాడమీ దే హావ : తెలంగాణ టైక్వాండో కప్ సొంతం



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) షోటోకన్ మెటోరియల్ ఆర్ట్స్ ఇంటర్నేషనల్ అకాడమీ వారి అధ్వర్యం రాంపల్లి లో నిర్వహించిన "తెలంగాణ కప్ డ్రాగన్ ఫిస్ట్ " టైక్వాండో పోటీల్లో హబ్సిగూడ లోని కె డి ఆర్ బ్లిట్జ్ అకాడమీ సంచలన విజయాలను నమోదు చేసుకుంది. తెలంగాణ



లోని వివిధ ప్రాంతాల నుండి జూనియర్, సబ్ జూనియర్ మరియు సీనియర్ విభాగాలకు గాను ఈ పోటీలు నిర్వహించటం జరిగింది. అన్ని విభాగాలలో కె డి ఆర్ అకాడమీ కె పురస్కారాలు లభించాయి. సబ్ జూనియర్ లో మాస్టర్ దేవరాజు అధ్యాంశ్ రాజు బంగారు పతకం మరియు వెండి పతకం, ప్రణవ్ బంగారు మరియు వెండి పతకం , సుహాన్ కాంస్య పతకం, కార్తీక్ మరియు జూనియర్ లో నిహన్ బంగారు పతకం, భువన్, మణి చెరన్ చెరో రెండు బంగారు పతకాలతో తమ సత్తా చాటారు. బాలికల విభాగం లో బేబీ భగీర వెండి పతకం సాధించింది మొత్తంగా బంగారు పతకాలు 22 , వెండి 12, కాంస్య 16 లను సొంతం

భళా.. బాపట్ల బ్లాక్ రైస్!



బీపీటీ 2841 రకం నల్ల బియ్యం వంగడాన్ని బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. రోగనిరోధక శక్తిని పెంపొందించే యాంటీ ఆక్సిడెంట్లతో పాటు ఐరన్, జింక్ వంటి సూక్ష్మపోషకాలను పుష్కలంగా కలిగి ఉండటం.. పంట పడిపోకుండా ఉండటం, చీడపీడలను తట్టుకోవటం, ఎకరానికి 30-35 బస్తాల దిగుబడినివ్వటం దీని ప్రత్యేకతలు. రైతుల పొలాల్లో ప్రయోగాత్మకంగా సాగు చేయించగా వరుసగా మూడేళ్లు సత్ఫలితాలు వచ్చాయి. సేంద్రియ/ప్రకృతి సేద్యానికి అనువైన ఈ విశిష్ట వంగడం అధికారిక విడుదలకు సిద్ధమవుతోంది. ఆరోగ్యకరమైన ఆహారం గురించి వినియోగదారుల్లో ఇటీవల అవగాహన పెరగడం, ప్రజల కొనుగోలు శక్తి పెరగడం వలన పోషకాలు కలిగిన ఆహార పదార్థాల వాడకం పెరిగింది.

సేంద్రియ ఆహారోత్పత్తులపై కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నందున నలుపు, ఎరుపు దేశవాళీ వరి రకాల సాగు, వాడకం క్రమక్రమంగా పెరుగుతోంది. కోతకు ముందు పడిపోవటం, దిగుబడులు తక్కువగా ఉండటం వంటి సమస్యలను తట్టుకునే సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ పూర్వరంగంలో బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు ఎకరానికి 30-35 బస్తాల దిగుబడినిచ్చే బీపీటీ 2841 బ్లాక్ రైస్ వంగడాన్ని అభివృద్ధి చేయటం విశేషం.

130-140 రోజుల పంట యం.టి.యు. 7029, ఐ.ఆర్.జి.సి. 18195, యం.టి.యు. 1081 అనే రకాల సంకరం ద్వారా బీపీటీ 2841 నన్న రకం బ్లాక్ రైస్ వంగడాన్ని శాస్త్రవేత్తలు రూపొందించారు. డా. బి. కృష్ణవేణి, డా. డి. సందీప్ రాజా, డా. సి.వి. రామారావు, డా. వై. సునీత, డా. కె.ఎ. మృదుల ఈ వంగడాన్ని అభివృద్ధి చేశారు. 2019-20 ఖరీఫ్ సీజను నుంచి రైతు క్షేత్రాల్లో మినీ కిట్ పరీక్షల నిర్వహణకు అనుమతి పొందింది.దీని పంట కాలం 130-140 రోజులు. ఈ రకం దాదాపు 110 సెం.మీ. ఎత్తు పెరుగుతుంది. పడిపోదు. దోమపోటు, అగ్గి తెగుళ్లను కొంత వరకు తట్టుకుంటుంది. మధ్యస్త సన్న రకం. వెయ్యి గింజల బరువు సుమారు 14-14.5 గ్రాములు. పైపొట్టును మాత్రమే తొలగించినప్పుడు (దంపుడు బియ్యం) 76.6% రికవరీనిస్తుంది. పాలీష్ చేస్తే 66% రికవరీనిస్తుంది. దంపుడు బియ్యం తింటే దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర పోషకాలన్నీ శరీరానికి అందుతాయి. పాలీష్ చేస్తే పై పొరలలోని నలుపు రంగులో ఉండే అంథోసైనిన్ తవుడులోకి వెళ్లి పోతుంది.

ఎకరానికి 35 బస్తాల దిగుబడి బీపీటీ 2841 రకం నారును 20"15 సెం.మీ. దూరంలో నాటుకుంటే హెక్టారుకు 6 టన్నుల వరకు దిగుబడినిస్తుంది. అయితే, పిలక చేసే సామర్థ్యం తక్కువ కాబట్టి 15"15 సెం.మీ. దూరంలో నాటుకుంటే (ఎకరానికి 20-25 కిలోల విత్తనం అవసరం) మంచిదని, ఇలా చేస్తే ఎకరానికి 35 బస్తాల (హెక్టారుకు 6.5 టన్నుల) వరకు దిగుబడి సాధించవచ్చని రైతుల అనుభవాల్లో తేలిందని బాపట్ల ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త, చెప్పారు.

రోగనిరోధక శక్తే కీలకం బీపీటీ 2841 సన్న వరి బియ్యం రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ఈ బియ్యం పైపొర నలుపు రంగులో ఉంటుంది. బియ్యానికి పై పొరలలోని నలుపు రంగు అంథోసైనిన్ అనే పదార్థం వల్ల వస్తుంది. మామూలుగా మనం రోజూ ఆహారంగీ తీసుకునే వరి రకాలతో పోల్చినప్పుడు నలుపు, ఊదా, ఎరుపు రంగు పై పొరగా కలిగినటువంటి వరి రకాలలో పాలీఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ పరిమాణంలో ఉంటాయి.నలుపు రంగు బియ్యం పై పొరలలో ఉండే దట్టమైన నలుపు రంగునిచ్చే ఆంథోసైనిన్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, సూపర్ ఫుడ్‌గా పిలవబడే బ్లూబెర్రీస్, బ్లాక్ బెర్రీస్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లతో సమానమైన పోషక విలువలను కలిగి ఉన్నట్లు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. బీపీటీ 5204తో పోల్చితే యాంటీ ఆక్సిడెంట్లు బీపీటీ 2841 బ్లాక్ రైస్‌లో 3-4 రెట్లు ఎక్కువగా ఉన్నాయి. పాలీష్ చేయని బీపీటీ 2841 దంపుడు బియ్యంలో వంద గ్రాములకు 90.52 మిల్లీ గ్రాముల ఫినాలిక్ పదార్థాలు, వంద గ్రాములకు 110.52 మిల్లీ గ్రాముల యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటీ ఉన్నట్లు కోత బాపట్లలోని అనంతర సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం ప్రయోగశాల పరీక్షల్లో వెల్లడైంది.5% పాలీష్ చేసిన బీపీటీ 2841 నల్ల బియ్యంలో కూడా వంద గ్రాములకు 90.19 మిల్లీ గ్రాముల యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటీ ఉన్నట్లు తేలింది. అదే విధంగా, పై పొట్టు మాత్రమే తొలగించిన ముడి బియ్యంలో 11.02%, పాలీష్ బియ్యంలో 6.3% మాంసకృత్తులున్నాయి. సూక్ష్మపోషకాలైన జింక్, ఇనుప ధాతువులు కూడా బీపీటీ 2841లో ఎక్కువ పరిమాణంలో ఉండటం విశేషం. యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటీ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలను ఆహారంగా తీసుకున్నప్పుడు అవి శరీరంలో ఉత్పత్తయిన ఫ్రీరాడికల్స్‌ను సమతుల్యం చేయటం వలన పలు రకాల కేన్సర్లు, గుండె సంబంధిత సమస్య, మధుమేహం వంటి దీర్ఘకాలిక రుగ్మతలను ఎదుర్కొనే రోగనిరోధక శక్తి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

అన్వి... అన్నీ విశేషాలే!



లండన్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకుంది. రెండున్నరేళ్ల పాప ఇన్ని రికార్డులు సాధించిందంటే చాలా విచిత్రంగా ఉన్నప్పటికీ ఇది అక్షరాలా నిజం. అన్వి పెయింటింగ్ జర్నీ కేవలం తొమ్మిది నెలల వయసులోనే జరగడం విశేషం. అప్పటినుంచి పెయింటింగ్స్ వేస్తూనే ఉంది."మ్యాగ్నెంట్, పెండులమ్, కలర్స్ ఆన్ వీల్స్, రిఫ్లెక్షన్ ఆర్ట్, హెయిర్ కాంబ్ టెక్చర్, రీ సైక్లింగ్ ఓల్డ్ టాయిస్, హ్యూమన్ స్పైరోగ్రఫీ, దియా స్ప్రే పెయింటింగ్, బబుల్ పెయింటింగ్" వంటి 37 రకాల పెయింటింగ్ టెక్నిక్స్‌ను ఆపోశన పట్టింది. పెయింటింగేగాక పంతొమ్మిది నెలల వయసు నుంచే స్పానిష్ భాషలో మాట్లాడడం ప్రారంభించింది.

42 అక్షర మాల శబ్దాలను స్పష్టంగా పలుకుతూ 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకుంది. అత్యంత అరుదైన చిన్నారులు మాత్రమే ఇవన్నీ చేయగలుగుతారు.అన్నట్లు అన్వి అందర్నీ అబ్బురపరుస్తోంది.

సులువులైన చిట్కాలతో చాక్లెట్ సమోసా-అంజీర్ హల్వా



పంచదార పొడి 5 టేబుల్ స్పూన్లు, నెయ్యి 2 టేబుల్ స్పూన్లు, డార్క్ చాక్లెట్ పౌడర్ 1 కప్పు, పిస్తా ముక్కలు 1 టేబుల్ స్పూన్‌పంచదార పాకం అభిరుచిని బట్టి (అప్పటికప్పుడు కావాల్సినంత పంచదార, నీళ్లు పోసుకుని స్టవ్ మీద పెట్టుకోవాలి), నీళ్లు సరిపడాతయారీ: ముందుగా ఒక బౌల్‌లో మైదాపిండి, నెయ్యి, 4 టేబుల్ స్పూన్ల పంచదార పొడి, నీళ్లు పోసుకుని బాగా కలిపి.. కొద్దికొద్దిగా నీళ్లు కలుపుకుంటూ చపాతీ ముద్దలా చేసుకుని ఓ పావు గంట పాటు ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి.ఈ సమయంలో ఒక బౌల్ తీసుకుని అందులో చాక్లెట్ పౌడర్, పంచదార పౌడర్, పిస్తా ముక్కలు వేసుకుని అటు ఇటుగా కలిపి.. పక్కన పెట్టుకోవాలి. పావు గంట తర్వాత ఫ్రిజ్‌లోంచి మైదా ముద్దను తీసి.. చిన్న చిన్న పూరీల్లా చేసుకుని.. ప్రతి పూరీలో కొంత చాక్లెట్ మిశ్రమం పెట్టుకుని సమోసాలా చుట్టుకోవాలి. అనంతరం రెండు స్టవ్‌లు ఆన్ చేసుకుని.. ఒకవైపు నూనె కళాయి, మరోవైపు పంచదార పాకం ఉన్న కళాయి పెట్టుకుని సమోసాలను నూనెలో దోరగా వేయించి.. వెంటనే పాకంలో వేసి తీసుకోవాలి. ఒకవేళ పాకంలో వేసుకోవడం ఇష్టం లేకుంటే చాక్లెట్ సాస్‌ని పైన గార్నిష్ చేసుకుని సర్వ్ చేసుకోవచ్చు.

అంజీర్ హల్వా కావలసినవి: డ్రై అంజీర్ 400 గ్రా.(నానబెట్టి, ముక్కలు చేసుకోవాలి) బియ్యప్పిండి/మొక్కజొన్న పిండి 5 టేబుల్ స్పూన్లు(5 టేబుల్ స్పూన్ల నీళ్లనూ జతచేసి బాగా కలుపుకోవాలి), నెయ్యి 9 టేబుల్ స్పూన్లు లేదా అంతకు మించి, పచ్చిపాలు అర కప్పు, పంచదార అభిరుచిని బట్టి, ఫుడ్ కలర్ కొద్దిగా (గ్రీన్ కలర్), యాలకుల పొడి కొద్దిగా, డ్రై ఫ్రూట్స్ ముక్కలు కొద్దిగా తయారీ: ముందుగా పాన్ లో 2 టేబుల్ స్పూన్ల నెయ్యి వేసుకుని, వేడి కాగానే.. అందులో బియ్యప్పిండి/మొక్కజొన్నపిండి మిశ్రమం వేసుకుని గరిటెతో తిప్పుతూ ఉండాలి. పాలు పోసుకుని చిన్న మంటపైన గరిటెతో తిప్పుతూ మరిగించుకోవాలి.



తర్వాత ఒక కప్పు పంచదార వేసుకుని కరిగే వరకూ గరిటెతో తిప్పుతూ ఉండాలి. అందులో అంజీర్ ముక్కలు, ఫుడ్ కలర్ వేసుకుని మధ్య మధ్యలో కొద్దికొద్దిగా నెయ్యి వేసుకుంటూ తిప్పుతూ ఉండాలి. దగ్గర పడిన తర్వాత ఒకసారి తీపి సరిపోయిందో లేదో చూసుకుని అవసరమైతే మరికొద్దిగా పంచదార వేసుకుని, మిగిలిన నెయ్యి కూడా వేసుకుని గరిటెతో కలుపుతూ దగ్గర పడే సమయంలో యాలకుల పొడి వేసుకుని స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. అభిరుచిని బట్టి నచ్చిన డ్రై ఫ్రూట్స్ ముక్కలతో గార్నిష్ చేసుకోవచ్చు లేదా.. నచ్చిన ఫ్లేవర్ ఐస్ క్రీమ్‌తో కలిసి తింటే భలే రుచిగా ఉంటుంది ఈ హల్వా.

పీయూష్, ఆమ్‌కా పన్నా, జల్‌జీరాతో కడుపు చల్లగా..







మిల్క్‌షేక్, ఐస్‌క్రీమ్‌ల వంటి వాటిలోనూ అదనపు రుచికోసం ఉపయోగిస్తారు. ఘజియాబాద్‌కు చెందిన హఫీజ్ అబ్దుల్ మజీద్ అనే యునాని వైద్యుడు శతాబ్ది కిందట రూపొందించిన 'రూఫ్ అఫ్జా' భారత ఉపఖండమంతటా విరివిగా వినియోగంలో ఉంది.

కొన్ని ప్రాంతాల్లో చందనం పొడి, కుంకుమపువ్వు, పంచదార, నిమ్మరసం కలిపి తయారు చేసే చందన షర్బత్‌ను కూడా వేసవి పానీయంగా సేవిస్తారు.

ఇవన్నీ ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా, వేసవితాపాన్ని తీర్చడంలో బాగా దోహ దపడతాయి.

ఈ వేసవిలో మీరూ వీటి రుచులను ఆస్వాదించండి.

మహారాష్ట్ర, గుజరాత్ ప్రాంతాల్లో వేసవిలో 'పీయూష్' అనే పానీయాన్ని విరివిగా తాగుతారు. దాదాపు దీని తయారీ లస్సీ మాదిరిగానే ఉంటుంది. బాగా చిలికిన పెరుగులో పంచదారతో పాటు శ్రీఖండ్ అనే సంప్రదాయ మిఠాయిని, జాజికాయ పొడి, ఏలకుల పొడి వంటివి చేర్చడం వల్ల దీనికొక విలక్షణమైన రుచి ఏర్పడుతుంది.

'పీయూషం' అంటే అమృతం అనే అర్థం ఉంది. 'పీయూష్' పానీయం అమృతసమానంగా ఉంటుందని మరాఠీ, గుజరాతీ ప్రజలు చెబుతారు.ఉత్తరాది రాష్ట్రాల్లో జల్‌జీరా, ఆమ్ కా పన్నా, ఖస్‌ఖస్, రూహ్ అఫ్జా వంటి సంప్రదాయ పానీయాలను వేసవిలో విరివిగా వినియోగిస్తారు. జీలకర్ర, మిరియాలు వంటివి కలిపి తయారుచేసే జల్‌జీరాను సాధారణంగా భోజనానికి ముందు సేవిస్తారు. దీనివల్ల అలసట తీరి, ఆకలి పుడుతుందని, జీర్ణశక్తి మెరుగుపడుతుందని చెబుతారు. పచ్చి మామిడికాయలతో తయారుచేసే ఆమ్ కా పన్నా, వట్టివేళ్లు, గసగసాలు కలిపి తయారుచేసే ఖస్‌ఖస్ పానీయాలను కొన్ని ప్రాంతాల్లో ఇష్టంగా సేవిస్తారు. గులాబీరేకుల కషాయానికి చక్కెర పాకాన్ని జోడించి తయారు చేసే 'రూహ్ అఫ్జా'తో నేరుగా షర్బత్ తయారు చేసుకోవడమే కాకుండా, దీనిని లస్సీ,

తల తిరగడం కూడా గుండె వైఫల్యానికి సంకేతమే!



మారుతున్న జీవనశైలి కారణంగా ప్రస్తుతం చాలామంది అధిక బీపీతో బాధపడుతున్నారు. దీనిని ఆహారంతోనే అదుపు చేయవచ్చు. గుమ్మడి గింజల్లో ఎన్నో పోషకాలు ఉంటాయి. వీటిని తినడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. పొటాషియం, మెగ్నీషియం ఇందులో ఎక్కువగా ఉంటాయి. ఇవి రక్తపోటును అదుపులో ఉంచుతాయి. చేపలలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి మన హృదయాన్ని ఫిట్‌గా ఉంచుతాయి. రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి.

మీకు తెలుసా?

తల తిరగడం కూడా గుండె వైఫల్యానికి సంకేతం. డీ హైడ్రేషన్ వల్ల మైకం వచ్చి గుండె పనిచేయదు. గొంతు లేదా దవడలో నొప్పి కూడా గుండెపోటుకు సంకేతం. అయితే అన్ని నొప్పులు గుండెనొప్పులకి కారణమని చెప్పలేం. కొన్నిసార్లు ఇది జలుబు లేదా సైనస్ కారణంగా వస్తుంది.కానీ కొన్నిసార్లు ఛాతీ నొప్పి గొంతు నుంచి దవడకు వ్యాపిస్తుంది. ఇది చాలా ప్రమాదం. మీరు చాలా త్వరగా అలసిపోయినట్లనిపిస్తే బలహీనతగా భావించకండి. ఎందుకంటే ఇది కూడా గుండెపోటుకు కారణమయ్యే లక్షణాలలో ఒకటని గుర్తుంచుకోండి.

చెమట కాయలా?

చందనం పొడి, వట్టివేళ్ల పొడిని రోజ్‌వాటర్‌లో కలిపి..



ఎండలు మండుతున్నాయి. దీంతో విపరీతమైన చెమట, దురదలతో చాలా ఇబ్బంది పడిపోతుంటారు. చర్మం తన మృదుత్వాన్ని కూడా కోల్పోతుంది. చెమటకాయలు దురదకు కారణమై, చికాకు, ఆయా భాగాలలో మంట, నొప్పికి దారితీస్తాయి. అతిగా చెమట పట్టే వారిలో వీటి సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది.సాధారణంగా నుదుటిపై, ముఖం, మెడ, వీపు, ఛాతీ, తొడల మీద చెమట కాయలు వస్తుంటాయి. వీటి తీవ్రత ఎక్కువైతే చర్మం ఎర్రపొక్కులుగా మారటం, గోకటం వల్ల చర్మం చిట్లి రక్తం కారడం జరుగుతుంది. కొన్ని చిట్కాలతో కొంత ఉపశమనం పొందవచ్చు. అవేంటో చూద్దాం. ?రెండు పూటలా స్నానం చేస్తూ శరీరాన్ని శుభ్రంగా వుంచుకోవాలి. చెమట ఎక్కువగా పట్టినప్పుడు స్నానం చేయడం, లేదా తడి వస్త్రంతో శరీరాన్ని తుడవడం తప్పనిసరి. వదులుగా ఉండే పల్చని కాటన్ వస్త్రాలు వేసుకోవాలి. నీళ్లు బాగా తాగాలి. దాంతో శరీరం చల్లగా ఉంటుంది. వీలైనంత వరకు ఎండలోకి వెళ్లకుండా చూసుకోవాలి.స్నానం చేసే నీటిలో గుప్పెడు మల్లెపూలు, జాజిపూలు లేదా వట్టివేళ్ల చూర్ణం వేసి గంటసేపు నానించి, ఆ నీటితో స్నానం చేయడం మంచిది. ఇటువంటి స్నానం శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.వంటినిండా చెమటకాయలు వచ్చినప్పుడు గంధం ముద్దని పేలిన చోట పల్చని పూతలా వేసుకుంటే, మంట, దురద తగ్గుతాయి. ఇందులో కర్పూరాన్ని కలిపి పేలిన చోట లేపనంలా రాసినా కూడా సమస్య అదుపులోకి వస్తుంది. మార్కెట్లో లభ్యమయ్యే గంధం పొడిలో సహజత్వం ఉండదు. అందుకే గంధపు చెక్కని సానపై అరగదీసి, దాన్ని వాడటం శ్రేయస్కరం.చందనం పొడి, వట్టివేళ్ల పొడిని రోజ్‌వాటర్‌లో కలిపి పల్చని లేపనంలా చెమట కాయలపై రాసినా మంచిదే. కలబంద గుజ్జుని రాసుకున్నా కూడా చెమటకాయల నుంచి ఉపశమనం కలుగుతుంది. తాటి ముంజెలలోని నీటిని చెమట కాయలపై రాసి, ఆరిన తర్వాత శుభ్రమైన వస్త్రంతో మృదువుగా తుడిచేయాలి. పుచ్చకాయ, కర్బూజా, కీరదోస, ముంజెలు, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, పల్చని మజ్జిగ... వంటి చలువచేసే పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి. కారం, గరం మసాలా, నూనెలో వేయించిన పదార్థాలకు దూరంగా ఉండాలి.

పోర్టబుల్ గ్రిల్.. చికెన్, మటన్




ఒక ప్రత్యేకమైన సందర్భాన్ని మరింత ప్రత్యేకంగా నిలిపేవి నోరూరించే పసందైన రుచులే. స్నేహితులతో లేదా కుటుంబ సభ్యులతో లాంగ్ డ్రైవ్‌కి వెళ్లినప్పుడు.. అలాంటి రుచులను అందిస్తూ ఆ సందర్భాన్ని అమృత జ్ఞాపకంగా మిగిల్చేదే.. ఈ లగేజ్ స్టయిల్ పోర్టబుల్ గ్రిల్. దీన్ని మన లగేజ్‌తో పాటు వెంట తీసుకెళ్తే చాలు, రుచుల పంట పండినట్లే. ఇందులో ఎలాంటి వంటైనా నిమిషాల్లో రెడీ అవుతుంది.చికెన్, మటన్ వంటి వాటినీ రకరకాలుగా గ్రిల్ చేసుకోవచ్చు. నచ్చిన విధంగా టోస్ట్ చేసుకోవచ్చు. చిత్రంలో కనిపిస్తున్న ఈ మెషిన్‌ని ఓపెన్ చేసుకోవడం, క్లీన్ చేసుకోవడం చాలా సులభం. ఇది చూడటానికి సూట్‌కేస్‌లా ఉంటుంది. మేకర్ ముందు భాగంలో రెండు రెగ్యులేటర్స్ ఉంటాయి. ఇది గ్యాస్ సాయంతో పనిచేస్తుంది. చిన్న గ్యాస్ సిలెండర్‌ని కూడా సెట్ చేసుకోవచ్చు. గ్రిల్ ప్లేట్స్ మార్చుకోవచ్చు.ఈ మేకర్ లోపల రెండు స్టెయిన్ లెస్ స్టీల్‌తో రూపొందిన గ్యాస్ స్టవ్‌లు అమర్చి ఉంటాయి. దీని మూత ఒకవైపు మేకర్‌కి అటాచ్ అయ్యుంటుంది. దాంతో సూట్‌కేస్‌ను తెరిచినట్లుగా ఓపెన్ చేసుకోవచ్చు. తేలికగా అటూ ఇటూ కదపడానికి ఒకవైపు రెండు చక్రాలు ఉంటాయి. మరోవైపు డివైజ్ మొత్తాన్ని పట్టుకునే హ్యాండిల్ ఉంటుంది. అదే మెషిన్ నిలబడటానికి స్టాండ్‌గా కూడా ఉపయోగపడుతుంది. ఇరువైపులా కూరగాయలు కట్ చేసుకోవడానికి, ఉప్పు, కారం డబ్బాలు పెట్టుకోవడానికి స్పెషల్ ప్లేట్స్ అమర్చి ఉంటాయి.

నోరూరించే కొండ మామిడి.. దీని ప్రత్యేకత ఏమిటంటే?



రాజవొమ్మంగి(అల్లూరి సీతారామరాజు జిల్లా): తూర్పు కనుమ అడవుల్లో ఈ కాలంలో ప్రకృతి సిద్ధంగా విరివిగా కనిపించే కొండమామిడి కాయలు అంటే ఇష్టపడని వారుండరు. ఇవి పక్వానికి వచ్చి పండుగా మారేందుకు మరో 20 రోజులు పడుతుంది. రైతులు సాగు చేసే సాధారణ రకాలకు సంబంధించి దిగుబడి గణనీయంగా పడిపోయింది. కలెక్టర్, బంగినపల్లి, రసాల రకాలకు చెంది కాపు ఏటా కన్నా ఈ ఏడాది బాగా తగ్గింది. అక్కడక్కడ కలెక్టర్ రకం కాయలు మాత్రమే కనిపిస్తున్నాయి. అయితే అటవీప్రాంతంలో మాత్రం అడవి మామిడి చెట్లు మాత్రం విరగ్గాశాయి. పక్వానికి రాగానే వాటికవే చెట్ల పైనుంచి నేలరాలతాయి. మంచి సువాసనతో నోరూరించే ఈ పండ్లను తినేందుకు పిల్లలు పెద్దలు ఎంతో ఆసక్తి చూపుతారు.పండ్లు కాయలు ఆకుపచ్చ రంగులోనే ఉండటం వీటి ప్రత్యేకత. ప్రకృతి సిద్ధంగా లభించే ఈ మామిడి పండ్లకు స్థానికంగా మంచి గిరాకీ. ఏమాత్రం పచ్చిగా ఉన్నా నోట్లో పెట్టలేనంత పుల్లగా వుంటాయి. పీచు ఎక్కువ. గుజ్జు పసుపు రంగులో ఉంటుంది. వేసవిలో పిల్లలు ఈ చెట్ల కిందనే ఎక్కువ సమయం గడుపుతారు. మండలంలోని కిమ్మిలిగెడ్డ, అమ్మిరేఖల, కొత్తవీధి, లోదొడ్డి తదితర లోతట్టు ప్రాంతాల్లో కొండమామిడి చెట్లకు కొదవలేదు. కిమ్మిలిగెడ్డ సమీపాన రక్షిత అడవుల్లో ఇవి గుబురు గుబురుగా, ఎత్తుగా పెరిగి కనిపిస్తాయి.కొండమామిడి కాయలు ఆవకాయకు బాగుంటాయని చెబుతుంటారు. ఈ కాయలకు టెంక పెద్దది, గుజ్జు పీచు కట్టి ఉన్నందున ముక్కలు బాగా వస్తాయని, పులుపు ఎక్కువ కనుక ఆవకాయ పచ్చడికి శ్రేష్ఠమని గృహిణులు చెబుతారు. సాధారణ మామిడి రకాలు అందుబాటులో లేని కారణంగా ఈ ఏడాది ఇక కొండమామిడి కాయలపైనే ఆధారపడాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు.

కీళ్ల నొప్పులా.. ఈ పండ్లు తిన్నారంటే



నేటి కాలంలో 30 ఏళ్లు దాటితే చాలు కీళ్ల నొప్పులు ప్రారంభమవుతున్నాయి. ఈ పరిస్థితిలో వాటిని ఎదుర్కోవటానికి చాలామంది చాలా చిట్కాలు పాటిస్తున్నారు. కానీ ఎటువంటి ఫలితాలు ఉండటం లేదు. కానీ ఆహారంలో ఈ మూడు పండ్లను చేర్చుకుంటే మంచి ఉపశమనం ఉంటుంది. ఆ పండ్లేమిటంటే...కీళ్లనొప్పులను తగ్గించే పండ్లునారింజ: రోజూ నారింజను తినడం వల్ల శరీరంలో నీటి కొరత తీరుతుంది. ఇందులో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. ఇది కీళ్లనొప్పులని తగ్గించడంలో సహాయపడుతుంది. ద్రాక్ష: వీలయినంత వరకు ద్రాక్షపండ్లను తీసుకోవడం ద్వారా అనేక రకాల వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుంది. ముఖ్యంగా కీళ్ల నొప్పుల నుంచి కూడా ఉపశమనం పొందవచ్చు. చిన్నప్పటినుంచి పిల్లలకి ద్రాక్ష పండ్లను తినిపించడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి. పుచ్చకాయ: వేసవి కాలంలో పుచ్చకాయ తినడం అన్ని విధాల శ్రేయస్కరం. దీనివల్ల శరీరంలో నీటి కొరత ఉండదు. తక్షణ శక్తి లభిస్తుంది. దీనిని తప్పకుండా ఆహారంలో చేర్చుకోవాలి.

ఎండాకాలం బయటికి వెళ్లే ముందు లేదా బయటి నుంచి వచ్చిన తర్వాత పుచ్చకాయ తీసు కుంటే మంచి ఉపశమనం ఉంటుంది.

ఇందులో ఉండే పోషకాలు కీళ్ల నొప్పులని తగ్గిస్తాయి.

రితుబెరి ఇక్కత్, ఖాదీలతో చేసిన రంగుల హంగామా చూడాల్సిందే!



వేసవిలో ఎక్కువగా వినిపించే పదం కాటన్. వేడిని తట్టుకొని, మేనికి హాయినిచ్చే సుగుణం ఉన్న ఫ్యాబ్రిక్. సింపుల్‌గా ఉండే కాటన్‌ని పార్టీవేర్‌గా మార్చుకోలేం. అనుకునేవారికి రితుబెరి కాటన్ కలెక్షన్ సరైన సమాధానం. లగ్జరీ ఫ్యాషన్ డిజైనర్‌గా పేరొందిన రితుబెరి ఇక్కత్, ఖాదీలతో చేసిన రంగుల హంగామా చూడాల్సిందే! సంప్రదాయ డిజైన్స్‌లోనే ఆధునికతను చూపడం ఈ డిజైనర్ ప్రత్యేకత. పలాజో, స్కర్ట్స్, ఓవర్‌కోట్స్, లాంగ్‌గౌన్స్‌కి రెండు మూడు రంగుల హంగులు అమర్చి చేసే మ్యాజిక్ చూపరులను మంత్రముగ్ధులను చేస్తాయి. చేనేతలతో ఎన్ని హంగుల అమరికతో వినూత్నమైన డిజైన్స్ తీసుకురావచ్చో రితుబెరి కలెక్షన్ చూస్తే ఇట్టే తెలిసిపోతుంది. క్రింకిల్డ్ ఖాదీ స్కర్ట్స్, ట్రౌజర్స్, ఎంబ్రాయిడీ చేసిన జాకెట్స్, లాంగ్ గౌన్స్.. కాంబినేషన్స్ చూపులను ఇట్టే కట్టిపడేస్తాయి. ఇకత్ రూపాలు ఇన్నన్ని కావు అని కళ్లకు కదతాయి. ఎక్కడ ఉన్నా ప్రత్యేకతను చాటుతాయి. విదేశాలలోనూ మన దేశీయ డిజైన్స్ ప్రత్యేకతను చాటే ఈ డిజైనర్ ఢిల్లీ వాసి. భారతదేశంలోని ఫ్యాషన్ పరిశ్రమలో సృజనాత్మకత, వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి లాభాపేక్షలేని 'ది లగ్జరీ లీగ్'ని ప్రారంభించింది.





కూల్‌గా ఉంటే హాట్‌గా, హాట్‌గా ఉంటే కూల్‌గా!



అంతేనా వాన కురిసినా.. ఫ్రెండ్స్‌తో గాసిప్ టైం అయినా..తలనొప్పి వచ్చినా... పరీక్షలకు ప్రిపేర్ కావాలన్నా.. అంతెందుకు పొద్దున లేవగానే మన బుర్రలో వచ్చే ఏకైక థాట్ టీ. ఫ్రెష్‌గా వేడి వేడి టీ పడందే రోజు మొదలుకాదు చాలా మందికి. టీ అంటే కేవలం ఒక రిఫ్రెష్ డ్రింకే మాత్రమేనా. కానే కాదు..అదొక సెంటిమెంట్..ఎమోషన్. ప్రతి సంవత్సరం మే 21న అంతర్జాతీయ టీ దినోత్సవాన్ని జరుపుకుంటారు. అసలు మే నెలలోనే ఈ డేను ఎందుకు జరుపుకుంటారు? దీని వెనకాల హిస్టరీ ఏంటి? మే 21న అంతర్జాతీయ టీ దినోత్సవంగా ప్రపంచవ్యాప్తంగా నిర్వహించాలని టీ బోర్డ్ ఆఫ్ ఇండియా సూచన మేరకు భారత ప్రభుత్వం యూఎన్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్‌కి ప్రతిపాదించింది.అలా తొలి ఇంటర్నేషనల్ టీ దినోత్సవాన్ని 2005లో ఢిల్లీలో నిర్వహించారు.ఎందుకంటే చాలా దేశాలలో ఈ నెలలోనే టీ ఉత్పత్తి సీజన్ ప్రారంభమవుతుంది. తేయాకు కార్మికుల సురక్షిత పని పరిస్థితులు, సరైన వ్యాపార నిర్వహణతోపాటు తేయాకు ఉత్పత్తిని మెరుగుపరిచే పరిస్థితులపై అవగాహన కల్పించడమే దీని ప్రధాన ఉద్దేశం. ఈ నేపథ్యంలోనే ప్రపంచవ్యాప్తంగా



ఇండియాతోపాటు ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా వినియోగించే వాటిల్లో టీ కూడా ఒకటి. 2007లో టీ బోర్డ్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, భారత దేశంలో ఉత్పత్తి చేయబడిన మొత్తం టీలో 80 శాతం ఇండయన్సే వినియోగిస్తున్నారు. ఇక్కడ 5వేల సంవత్సరాలకు పైగా టీ మూలాలు విస్తరించి ఉన్నాయట. టీ అంటే ఒక భావోద్వేగం. సంతోషమైనా, ఉత్సాహమైనా, అలసిపోయినా సందర్భం ఏదైనా బెస్ట్ ఫ్రెండ్ టీ. దానికి చిట పట చినుకుల్లో పకోడీ తోడైతే ఆహా ఆ రంగు రుచి వాసనలతో మరో ప్రపంచంలో విహరిస్తాం. లక్షల మందికి ఉపాధినందిస్తున్న ఈ తేనీటిని సందర్భాన్ని బట్టి ప్రాంతాన్ని బట్టి దీనిని అనేక విధాలుగా తయారు చేయవచ్చు. వీటిలో కొన్ని కాశ్మీరీ కహ్వా, అల్లం టీ, తులసి టీ, సులైమాని టీ, రోంగా టీ, మసాలా టీ, లెమన్‌గ్రాస్ టీ, గ్రీన్ టీ. బెల్లం, మిరియాల టీ, అబ్బో.. ఈ లిస్ట్ చాలా పెద్దది.

మన బాడీ డిటాక్స్ చేసుకోవడానికి కూడా రకరకాల టీలు ఉపయోగపడతాయి. యాంటీ ఆక్సిడెంట్లు , యాంటీ ఇన్‌ఫ్లమేటరీ పదార్థాల సంపూర్ణ మిశ్రం టీ. హల్దీ టీ రోగనిరోధక శక్తిని పెంచి, కాలేయాన్ని శుభ్రపరిస్తే.. తేనె నిమ్మకాయ అల్లం దట్టించిన టీ గొంతు నొప్పి , జలుబుకు చక్కటి



చిట్కా. అలాగే హనీ లెమన్ జింజర్ టీ, ఆమ్లా అల్లం టీ ద్వారా విటమిన్ సీ దొరుకుతుంది. దీంతో బరువు తగ్గించుకోవచ్చు. డిటాక్స్ డైట్‌లో అల్లం అజ్వైన్ లెమన్ టీ, జింజర్ అజ్వైన్ లెమన్ టీ చేర్చుకుంటే బరువు తగ్గే ప్రక్రియ వేగవంత మవుతుందని నిపుణులు కూడా నమ్ముతున్నారు. మరోవైపు సాహసికుడు,టీ ప్రేమికుడు, ఆంధ్రా హ్యూస్ చరిత్రలో అత్యధిక టీ పార్టీని నిర్వహించిన ఘనత సాధించారు. బ్లాక్ , గ్రీన్ టీ, పిప్పరమెంటు,



చమోమిలే వంటి టీలను ఆయన అందించారట. నేపాల్‌లోని మౌంట్ ఎవరెస్ట్ క్యాంప్ 2, మే 5, 2021న 6,496 మీటర్ల ఎత్తులో, ఆంధ్రా 15 మంది అధిరోహకుల బృందంతో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించారు. మరి మీరు కూడా మంచి టీ పార్టీతో మీ స్నేహితులతో ఇంటర్నేషనల్ టీ డేని ఎంజాయ్ చేయండి.

తోతాపురి మామిడికాయలు, అరకేజీ బెల్లం..

సింపుల్‌గా ఇలా ఆవకాయ పెట్టేయండి!



– బెల్లం ఆవకాయను ఇష్టపడే వారు చాలా మందే ఉంటారు. మరి ఈ వంటకం ఎలా తయారు చేసుకోవాలో తెలుసుకుందామా!

బెల్లం ఆవకాయ తయారీకి కావలసినవి: తోతాపురి మామిడికాయలు ఐదు. బెల్లం అరకేజీ నువ్వులనూనె పావుకేజీఆవాలు పావు కేజీ, కారం కప్పు, ఉప్పు కప్పు, మెంతులు రెండు టీస్పూన్లు, పసుపు రెండు టీస్పూన్లుఇంగువ అరటీస్పూను తొక్కతీసిన వెల్లుల్లి రెబ్బలు కప్పు.**బెల్లం ఆవకాయ తయారీ విధానం** ముందుగా మామిడి కాయలను శుభ్రంగా కడిగి పొడిగా తుడుచుకోవాలి.కాయల్లో జీడి తీసేసి ముక్కలు చేసుకోవాలి. టెంకపైన ఉన్న జీడిపొరను తీసేసి శుభ్రంగా తుడవాలి. ఆవాలు, మెంతులను గంటపాటు ఎండబెట్టి పొడిచేసుకోవాలిఇప్పుడు పెద్ద గిన్నెతీసుకుని ఆవపొడి, పసుపు, మెంతి పిండి, కారం, ఉప్పు వేసి కలపాలి.ఇప్పుడు బెల్లాన్ని సన్నగా తురిమి వేయాలి. దీనిలో ఇంగువ కూడా వేసి చక్కగా కలపాలి.ఇప్పుడు మామిడికాయ ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి చేతితో కలపాలి.తర్వాత కొద్దిగా ఆయిల్ తీసి పక్కనపెట్టి, మిగతా ఆయిల్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని పొడి జాడీలో వేసి పైన మిగతా ఆయిల్ వేయాలి. మూడు రోజుల తరువాత పచ్చడిని ఒకసారి కలపాలి, జాడీలో నిల్వచేసుకోవాలి.

యూపీలో ఒవైసీ కూటమి

లక్నో ,: యూపీ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ, ఆ రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసే కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఆజాద్ సమాజ్ పార్టీ కాన్షీరాం అధ్యక్షుడు, నగీనా ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ అధికారికంగా రాజకీయ పొత్తును ప్రకటించారు. లక్నో వేదికగా నవంబర్ 12న వీరిద్దరూ సంయుక్త మీడియా సమావేశం నిర్వహించి యూపీలో కొత్తగా సామాజిక పరివర్తన మోర్చా పేరిట మూడో కూటమికి తెరలేపారు. ఇండియా కూటమిలో తమకు స్థానం కల్పించాలంటూ సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌లకు ఒవైసీ ఇచ్చిన గడువు ముగియడం, అఖిలేష్ యాదవ్ మొండిచేయి చూపడంతో.. ఒవైసీ నేరుగా చంద్రశేఖర్ ఆజాద్‌తో జట్టుకట్టి యూపీలో 'దళిత-ముస్లిం' కాంబినేషన్‌ను సెట్ చేశారు.యూపీ రాజకీయాల్లో దశాబ్దాల పాటు దళిత ఓటుబ్యాంకుకు ఏకైక అధినేత్రిగా వెలుగొందిన బీఎస్పీ అధినేత్రి మాయావతి ప్రభావం ప్రస్తుతం క్షేత్రస్థాయిలో బలహీనపడటంతో, ఆ రాజకీయ శూన్యతను నగీనా ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ వేగంగా భర్తీ చేస్తున్నారు. ముఖ్యంగా యువ దళిత ఓటర్లలో ఆజాద్‌కు పెరుగుతున్న ఆదరణను గుర్తించిన ఒవైసీ.. రాష్ట్రంలోని దాదాపు 40 శాతం వరకు ఉన్న ముస్లిం మైనారిటీ ఓట్లను, దళిత ఓట్లను ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు ఈ వ్యూహాత్మక పొత్తు కుదుర్చుకున్నారు. బలహీనవర్గాలు, యువత, రైతుల హక్కుల కోసం తమ కూటమి పోరాడుతుందని ఇరువురు నేతలు స్పష్టం చేస్తూనే, ఇప్పటివరకు దళితులు, ముస్లింలను కేవలం ఓటుబ్యాంకుగా వాడుకున్న ప్రధాన పార్టీలకు గట్టి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కొత్త కూటమి ఆవిర్భావం ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో ఏ స్థాయి ప్రభావం చూపిస్తుందన్నది ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారింది. రాష్ట్రంలోని 403 అసెంబ్లీ స్థానాల్లో పశ్చిమ యూపీ, రోహిల్‌ఖండ్, పూర్వాంచల్ ప్రాంతాల్లోని సంభల్, రాంపూర్, మీరట్, నగీనా, ఆజంగఢ్, బహ్రాయిచ్, శ్రావస్తి, కుందర్కి వంటి సుమారు 150 స్థానాల్లో ఈ కూటమి పోటీ చేసేందుకు సిద్ధమవుతోంది. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంఐఎం 5 మున్సిపల్ ఛైర్మన్ పీఠాలు, 83 కౌన్సిలర్ స్థానాలను గెలుచుకోవడం, పార్లమెంట్ ఎన్నికల్లో చంద్రశేఖర్ ఆజాద్ సత్తా చాటడం వీరి ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. గత 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఇరు పార్టీలూ ఖాతా తెరవకపోయినప్పటికీ, ఈసారి కలిసి బరిలోకి దిగడం ద్వారా సమీకరణాలను మార్చాలని చూస్తున్నాయి. ఒకవేళ సామాజిక పరివర్తన మోర్చా గణనీయమైన స్థాయిలో దళిత, ముస్లిం ఓట్లను చీల్చగలిగితే.. అది నేరుగా అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ కూటమి ఫార్ములా విజయవకాశాలకు భారీ గండికొట్టడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ముస్లిం ఓటర్లు అధికంగా ఉన్న 40-45 నియోజకవర్గాల్లో ఒవైసీ పార్టీ అభ్యర్థులు చీల్చే ఓట్లు అఖిలేష్ యాదవ్‌కు పెద్ద తలనొప్పిగా మారనున్నాయి. అదే సమయంలో బీఎస్పీ ఒంటరి పోరుకు సిద్ధమవుతుండటంతో దళిత ఓటుబ్యాంకు మాయావతి, చంద్రశేఖర్ ఆజాద్ మరియు ఎస్పీల మధ్య చీలిపోయే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.మొత్తానికి, మూడోసారి అధికారంలోకి రావాలని చూస్తున్న బీజేపీకి ఒకవైపు, దాన్ని అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్న 'ఇండియా' కూటమికి మరోవైపు.. ఒవైసీ-ఆజాద్ జోడీ ఇప్పుడు అతిపెద్ద సవాలుగా నిలిచింది. మాయావతి నిస్తేజంతో విసిగిపోయిన దళితులు, అఖిలేష్ యాదవ్ వైఖరిపై అసంతృప్తితో ఉన్న ముస్లిం వర్గాలు ఈ కొత్త వేదిక వైపు ఆకర్షితులైతే యూపీ ఎన్నికల ఫలితాలు తలకిందులయ్యే అవకాశం ఉంది. అయితే, ఈ కొత్త కూటమి కేవలం ప్రతిపక్ష ఓట్లను చీల్చే శక్తిగానే మిగిలిపోయి బీజేపీకి పరోక్షంగా లాభం చేకూరుస్తుందా, లేక బీహార్ తరహాలో యూపీ రాజకీయాల్లోనూ ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా అవతరిస్తుందా అనేది రాబోయే 2027 ఎన్నికల రణరంగంలో తేలనుంది.

విమానం ల్యాండింగ్ గేర్ ఫెయిల్..
పుణె ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండింగ్..!



పుణె :ల్యాండింగ్ గేర్ ఫెయిల్ కావడంతో గువాహటికి వెళ్లాల్సిన ఇండిగో విమానంఅత్యవసరంగా పుణె ఎయిర్‌పోర్టు లో ల్యాండ్ అయ్యింది. టేకాఫ్ తర్వాత విమానం ల్యాండింగ్ గేర్ వెనక్కి ముడుచుకోకపోవడంతో పుణెకు తిరిగి వచ్చింది. ఫ్లైట్ 6ఇ 0623 పైలట్ వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) కి సమాచారం అందించడంతో భారత వైమానిక దళం పుణె ఎయిర్‌పోర్టులో పూర్తిస్థాయి అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. ఈ ప్రక్రియలో భాగంగా అగ్నిమాపక దళాలు, అంబులెన్స్‌లు, అత్యవసర ప్రతిస్పందన బృందాలను అత్యంత అప్రమత్తంగా ఉంచారు. 192 మంది ప్రయాణికులు, సిబ్బందితో ఉన్న ఆ విమానం ఉదయం 9:04 గంటలకు సురక్షితంగా ల్యాండయ్యింది. ల్యాండింగ్‌కు ముందు గ్రౌండ్ బృందాలు ల్యాండింగ్ గేర్‌ను ప్రత్యక్షంగా తనిఖీ చేయడానికి వీలుగా రన్‌వేపై తక్కువ ఎత్తులో ప్రయాణించింది. మూడు ఫైర్ ఇంజిన్‌లు, రెండు అంబులెన్స్‌ల సాయంతో ప్రయాణికులు, సిబ్బంది అందరినీ ఏరోబ్రిడ్జ్ ఉపయోగించి బే నంబర్ 7కు సురక్షితంగా తరలించారు. ఈ ప్రక్రియలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఉదయం 9:10 గంటలకు పూర్తిస్థాయి అత్యవసర పరిస్థితిని అధికారికంగా ఉపసంహరించారు.

ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో
హిట్ అండ్ రన్..
- బాలుడికి గాయాలు



హైదరాబాద్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో హిట్ అండ్ రన్ ఘటన కలకలకం రేపింది. అంకుశాపూర్ ప్రాంతానికి చెందిన సంపత్ కొడుకు ఉజ్జయిన్ (3) రోడ్డు దాటుతుండగా ఓ కారు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో బాలుడి చెవి, తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా కారు నంబర్ (TG 15 BA 0593) గా గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కదులుతున్న రైలు ఎక్కుతూ జారిపడిన వ్యక్తిని కాపాడిన పోలీసులు



కదులుతున్న రైలు ఎక్కుతూ జారిపడిన వ్యక్తిని రైల్వే పోలీసులు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లాకు చెందిన చంద్రయ్య (53) సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో కదులుతున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలులో ఎక్కేందుకు ప్రయత్నించాడు. రైలు ఎక్కే క్రమంలో జారిపోయి ప్లాట్‌ఫామ్‌కు, రైలుకు మధ్య పడిపోవడంతో వెంటనే గమనించిన ఆర్‌పీఎఫ్ పోలీసులు అతడిని సురక్షితంగా కాపాడారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

అనకాపల్లి జిల్లాలో విషాదం..
నదిలో స్నానానికి దిగి ముగ్గురు యువకులు మృతి



అమరావతి : ఏపీలోని అనకాపల్లి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ఎస్ రాయవరం మండలం పెనుగల్లులో వరాహ నదిలో స్నానానికి దిగి గల్లంతైన ముగ్గురు యువకులు మృతి చెందారు. శనివారం నదిలో స్నానానికి దిగిన ఆరుగురిలో ముగ్గురు గల్లంతయ్యారు. నది ప్రవాహం నుంచి ముగ్గురు యువకులు సురక్షితంగా బయటపడగా గల్లంతైన ముగ్గురు మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. కాతేటి రిషి (18) , ముప్పిడి వంశీ(20), కోడి గణేష్ (20) గా పోలీసులు గుర్తించారు. ముగ్గురు యువకులు మృతి పట్ల హోంమంత్రి అనిత దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మియామి ఎయిర్‌పోర్టులో
రెండు విమానాలు ఢీ..
- ఇద్దరికి గాయాలు..!



అమెరికాలో విమానాల రాకపోకలు నిలిచిపోవడంతో శుక్రవారం తీవ్ర గందరగోళం నెలకొన్నది. శుక్ర, శనివారాల్లో విమానాశ్రయాల్లో లక్షలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. ఈ ఘటనను మరువకముందే శనివారం రాత్రి మియామి అంతర్జాతీయ విమానాశ్రయంలోని టార్మాక్‌పై రెండు విమానాలు ఢీకొన్నాయి. రన్‌వేపై మలుపు తిరుగుతున్న ఒక విమానం రెక్క కొన వెనుకనున్న విమానం ముక్కుకు తగిలింది. శనివారం రాత్రి 9:15 గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. పనామా సిటీ నుంచి 166 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందితో వచ్చిన కోపా ఎయిర్‌లైన్స్ బోయింగ్ 737 విమానం రెక్క కొన.. ఎయిర్‌పోర్టు టాక్సీవేలపై కదులుతున్న యూపీఎస్ బోయింగ్ 767 కార్గో విమానం ముక్కును ఢీకొట్టిందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారని కోపా ఎయిర్‌లైన్స్ ఆదివారం వెల్లడించింది. వారు చికిత్స పొందుతున్నారని ప్రాణాపాయం లేదని తెలిపింది. ఈ ఘటన జరిగినందుకు తాము చింతిస్తున్నామని పేర్కొన్నది.

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ..
నిన్న ఒక్కరోజే 83,670 మంది దర్శనం



తిరుమల : ఏడు కొండలవాడా వేంకటరమణ గోవిందా..గోవిందా అంటూ తిరుమల కొండపై భక్తుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆదివారం కంపార్టుమెంట్లు అన్నీ నిండిపోయి శిలాతోరణం వరకు క్యూలైన్‌లో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 18 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. శనివారం ఒక్కరోజే 83,670 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా 35,785 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 4.02 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. 4.32 లక్షల లడ్డూలను విక్రయించగా 4.32 లక్షల మందికి అన్నప్రసాదం అందించామని వెల్లడించారు.

పని చేయని ఎమర్జెన్సీ పరికరాలు.
జగిత్యాల మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మృతి



జగిత్యాల: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆస్పత్రుల నిర్వహణ, పర్యవేక్షణ ఎలా ఉందో తెలిపే మరో ఘటన ఇది. జగిత్యాల ప్రభుత్వాసుపత్రిలో అత్యవసర సమయంలో ఎమర్జెన్సీ పరికరాలు పనిచేయకపోవడంతో ఓ నిండు ప్రాణం పోయింది.మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యూసుఫ్‌కు జగిత్యాల గుండెపోటు రావడంతో ఆయన కొత్త బస్టాండ్ సమీపంలో కుప్పకూలిపోయారు. దీంతో యూసుఫ్‌ను స్థానికులు వెంటనే జగిత్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ఆస్పత్రిలో అత్యవసరం సేవలకు ఉపయోగించే ఈసీజీ మిషన్, ఇతర పరికరాలు పనిచేయలేదు. సరైన సమయంలో వైద్యం అందించే పరిస్థితి లేకపోవడంతో యూసుఫ్ ప్రాణాలు కోల్పోయారు.అత్యవసర సమయంలో ఎమెర్జెన్సీ వైద్య పరికరాలు పనిచేయకపోవడంపై యూసుఫ్ కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ పని చేయడం లేదు.. జిరాక్స్ రాదు.. సరైన మనుషులు లేకపోతే ఇక్కడికొచ్చినవాళ్లు చనిపోయతారు.. ముందు మిషన్ మంచిగా చేయించండి.. అంటూ యూసుఫ్ కుటుంబసభ్యుడొకరు ఆస్పత్రి మేనేజ్‌మెంట్‌పై ఫైర్ అయ్యాడు.

బొరంపేటలో భారీ అగ్నిప్రమాదం..
- ఐదు ట్రావెల్స్ బస్సులకు మంటలు..
- మూడు బస్సులు దగ్ధం!



హైదరాబాద్ నగర శివార్లలోని దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బొరంపేటలోని బొడ్రాయి సమీపంలో ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల పార్కింగ్ యార్డ్‌లో అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో మూడు బస్సులు పూర్తిగా దగ్ధమవగా.. మరో రెండు బస్సులకు మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికంగా తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.స్థానికుల సమాచారం ప్రకారం.. ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన పలు బస్సులను యార్డ్‌లో ఒకదాని పక్కన మరొకటి పార్కింగ్ చేసి ఉంచారు. ఈ క్రమంలో అకస్మాత్తుగా ఓ బస్సుకు మంటలు అంటుకున్నాయి. బస్సులన్నీ దగ్గరదగ్గరగా ఉండటంతో మంటలు వేగంగా పక్కనే ఉన్న వాహనాలకు వ్యాపించాయి. చూస్తుండగానే మూడు బస్సులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. మరో రెండు బస్సులకు కూడా మంటలు అంటుకున్నాయి.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే, అగ్నిప్రమాదానికి అసలు కారణం ఏమిటన్నది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనలో భారీగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

డ్రాస్ సెక్టార్‌లో మంచు అందాల కనువిందు



శీతాకాలం ఆరంభమైందో లేదో అప్పుడే హిమాలయాలకు సమీపంలోని రాష్ట్రాల్లో మంచు కురవడం మొదలైంది. కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్ముకశ్మీర్, లధఖ్‌తోపాటు ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో మంచు కురుస్తున్నది. తాజాగా లధఖ్‌లోని డ్రాస్ సెక్టార్‌లో పలు ప్రాంతాలను మంచు దుప్పటి కప్పేసింది. రోడ్ల నిండా మంచు కమ్ముకున్నది. ఇండ్లు, ఇండ్ల ముందున్న వాహనాలు కూడా మంచులో కూరుకుపోయాయి. మంచుతో నిండి ఉన్న గుట్టలు తలతల మెరుస్తూ స్వచ్ఛమైన వెండి కొండలను తలపిస్తున్నాయి. డ్రాస్ సెక్టార్ మొత్తం తేటతెల్లని వస్త్రం పరిచినట్లుగా కనువిందు చేస్తున్నది. టూరిస్టుల మనసులకు ఎంతో హాయిని, ఆహ్లాదాన్ని కలుగజేస్తున్నది. స్థానికులకు ఈ మంచు అందాలను చూడటం కొత్త కాకపోయినా.. పర్యాటకులను మాత్రం ఈ మంచు అందాలు ఆనంద పారవశ్యంలో ముంచెత్తుతున్నాయి.

యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తులు!



కార్తీక మాసం.. అందులోనూ ఆదివారం సెలవుదినం కావడంతో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. కొండపైకి వెళ్లే వాహనాలు సైతం బారులు తీరడంతో రద్దీ నెలకొంది.కార్తీక మాసం కావడంతో భక్తులు స్వామివారి దర్శనంతో పాటు ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించారు. ఈ క్రమంలో సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో భక్తుల సందడి నెలకొంది. పెద్ద సంఖ్యలో భక్తులు వ్రత పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కొండపైన ఉన్న మండపాల్లో దీపారాధన చేసి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు.మరోవైపు కొండపైకి వెళ్లే వాహనాల రద్దీ పెరగడంతో ఆలయ అధికారులు అవసరాన్ని బట్టి వాహనాలను అనుమతిస్తున్నారు. క్యూలైన్లు, వ్రత మండపాలు, కొండపైన పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. ధర్మదర్శనానికి సుమారు మూడు గంటల సమయం పడుతోందని ఆలయ అధికారులు వెల్లడించారు.

విడాకులు తీసుకోలేదు: రమ్యకృష్ణ



సీనియర్ నటి రమ్యకృష్ణ తన వైవాహిక జీవితంపై వస్తున్న ప్రచారాలకు తెరదించారు. తన భర్త, దర్శకుడు కృష్ణవంశీతో తాను విడిపోయినట్లు వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని... తామిద్దరం ఇప్పటికీ భార్యాభర్తలమేనని ఆమె స్పష్టం చేశారు. తాజాగా పాల్గొన్న ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో ఆమె మొదటిసారి తన వ్యక్తిగత జీవితం గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తాను ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండనని, పనికి సంబంధించిన విషయాలు తప్ప పర్సనల్ విషయాలను బయట పెట్టడం తనకు ఇష్టం ఉండదని రమ్యకృష్ణ తెలిపారు. కృష్ణవంశీతో బంధం గురించి మాట్లాడుతూ... "నేను, కృష్ణవంశీ ఇప్పటికీ దంపతులమే. కానీ, సంతోషంగా వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నాం. కెరీర్ పరంగా మేం అలా ఉండాల్సి వస్తోంది. మా అబ్బాయి పుట్టినప్పుడు నేను సీరియల్స్‌తో బిజీగా ఉన్నాను. ఆ సమయంలో 15 రోజులకు ఒకసారి చెన్నై- హైదరాబాద్ ట్రావెల్ చేసేదాన్ని. నేను అలా వచ్చి వెళ్లిన ప్రతిసారి మా అబ్బాయి అనారోగ్యానికి గురయ్యేవాడు. దీంతో నేను వాడిని చెన్నైలోనే చదివిస్తానని కృష్ణవంశీతో చెప్పాను" అని వెల్లడించారు. రమ్యకృష్ణ, కృష్ణవంశీ 2003లో వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కెరీర్, బాబు చదువు నిమిత్తం రమ్యకృష్ణ చెన్నైలో ఉంటుండగా, కృష్ణవంశీ హైదరాబాద్‌లో ఉంటూ సినిమాలు చేస్తున్నారు. ఇద్దరూ వేర్వేరు నగరాల్లో ఉండటంతో గత కొంతకాలంగా వీరి దాంపత్యంపై రకరకాల రూమర్లు వచ్చాయి. అయితే, తాము విడిపోలేదని, పరస్పర అవగాహనతోనే కెరీర్, కుటుంబ బాధ్యతల కోసం ఇలా ఉంటున్నామని చెప్పడంతో ఈ వదంతులకు ఫుల్‌స్టాప్ పడింది.

తండ్రి పిల్లలను చూసుకోవడం ఎవరికీ చేసే ఉపకారం కాదు



పిల్లల పెంపకం, బాధ్యతల విషయంలో సుమాజం చూసే విధానంలో మార్పు రావాలని ప్రముఖ వ్యాపారవేత్త, సినీ నటుడు రామ్ చరణ్ భార్య ఉపాసన కొణిదెల స్పష్టం చేశారు. పిల్లల సంరక్షణలో తల్లిదండ్రుల బాధ్యతలపై సమాజంలో ఉన్న అసమానతలను ఉపాసన ప్రస్తావించారు. "ఒక తండ్రి పిల్లకు అన్నం తినిపించినా లేదా డైపర్ మార్చినా.. ఎంత మంచి తండ్రో అంటూ అందరూ ప్రశంసిస్తూ చప్పట్లు కొడతారు. మరి అదే పని తల్లి రోజూ చేస్తున్నప్పుడు ఆమె కోసం ఎవరైనా చప్పట్లు కొడుతున్నారా? ఇంట్లో ఈ ఆలోచనా విధానం మారకపోతే, బయట కార్పొరేట్ బోర్డు రూముల్లోనూ మహిళలకు సమానత్వం రాదు. పిల్లలను చూసుకోవడం ద్వారా తండ్రి ఎవరికీ ఎలాంటి ఉపకారం చేయడం లేదు. అది పెంపకంలో అతని ప్రాథమిక బాధ్యత మాత్రమే. ఇది మన విద్యా విధానంలో, ప్రజల ఆలోచనల్లో భాగం కావాలి" అని ఆమె పేర్కొన్నారు. తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకుంటూ... రామ్ చరణ్ పిల్లలకు భోజనం పెడుతుంటే గతంలో తాను కూడా ఎంతో ముచ్చటగా చూసేదాన్నని, అయితే తల్లిదండ్రులుగా అది ఒక సాధారణ బాధ్యత అని ఇప్పుడు గ్రహించానని ఉపాసన వివరించారు. రామ్ చరణ్, ఉపాసన దంపతులకు 2023లో జన్మించిన కుమార్తె క్లిన్ కారాతో పాటు, 2026లో కవలలు శివరామ్,

సినిమాతో నా మాట నిలబెట్టారు



'మాటలు రాని హీరోతో కథ చెప్పడం అంత ఈజీ కాదు. దర్శకుడు మహేశ్‌కు గొప్ప భవిష్యత్తు ఉంది. హీరో అనీశ్ గురించి ప్రేక్షకులు గొప్పగా చెబుతున్నారు. అతని విషయంలో నాకు గర్వంగా ఉంది. ఈ సినిమా చూశాక కథానాయిక అనస్వర రాజన్‌కు ఫ్యాన్ అయిపోయాను. ఈ సినిమాను నేను ప్రజెంట్ చేసినందుకు అద్భుతమైన విజయంతో చిత్రబృందం నా మాట నిలబెట్టారు' అన్నారు అగ్ర నటుడు అక్కినేని నాగార్జున.ఆయన సమర్పణలో రూపొందిన తాజా చిత్రం 'ఇట్లు అర్జున' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. అనీశ్, అనస్వర రాజన్ జంటగా నటించిన ఈ చిత్రానికి మహేష్ ఉప్పల దర్శకుడు. శనివారం ఏర్పాటు చేసిన సక్సెస్‌మీట్‌లో నాగార్జున మాట్లాడుతూ పైవిధంగా స్పందించారు. ఈ సినిమా విషయంలో నాగార్జున సపోర్ట్‌ను మరచిపోలేమని, విడుదలైన అన్ని కేంద్రాల్లో పాజిటివ్ టాక్ సొంతం చేసుకుందని చిత్ర నిర్మాత వెంకీ కుడుముల అన్నారు. సినిమాక్లైమాక్స్‌లో ప్రేక్షకులందరూ చప్పట్లు కొడుతుంటే తొలి సినిమా నటుడిగా ఎంతో ఆనందం కలిగిందని, బ్యూటీఫుల్ లవ్‌స్టోరీ, యాక్షన్ కలబోసిన ఈ సినిమాను ప్రేక్షకులందరూ ఆదరిస్తున్నారని హీరో అనీశ్ తెలిపారు. సినిమా చూసినవాళ్లందరూ పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ ఇస్తున్నారని దర్శకుడు మహేశ్ ఉప్పల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు తమన్‌తో పాటు చిత్ర బృందమంతా పాల్గొన్నారు.

బాక్సాఫీస్ వద్ద 'రామాయణ' రికార్డుల ప్రభంజనం

ప్రపంచవ్యాప్తంగా రూ.1200 కోట్ల వసూళ్లు!



రణ్‌బీర్ కపూర్, యశ్ ప్రధాన పాత్రల్లో నటించిన పౌరాణిక చిత్రం 'రామాయణ: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్' బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. విడుదలైన కేవలం 10 రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 1228 కోట్ల గ్రాస్ వసూలు చేసి సరికొత్త చరిత్ర సృష్టించింది. రెండో శనివారం నాటికి ఈ సినిమా కలెక్షన్ల పరంగా రూ. 1200 కోట్ల మైలురాయిని సునాయాసంగా దాటింది. ప్రముఖ ట్రేడ్ ట్రాకర్ 'సాక్‌నిల్క్' వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ చిత్రం పదో రోజైన శనివారం భారత్‌లో రూ. 72.90 కోట్ల నెట్ వసూళ్లు రాబట్టింది. దీంతో ఇప్పటివరకు దేశీయంగా మొత్తం నెట్ కలెక్షన్లు రూ. 685.60 కోట్లకు చేరాయి. ఇండియా గ్రాస్ వసూళ్లు రూ. 819.50 కోట్లుగా నమోదయ్యాయి. మరోవైపు, ఓవర్సీస్‌లోనూ ఈ చిత్రం అద్భుతంగా రాణిస్తోంది. పదో రోజున విదేశాల్లో సుమారు రూ. 30 కోట్లు వసూలు చేయగా, మొత్తం ఓవర్సీస్ గ్రాస్ రూ. 408.50 కోట్లకు చేరింది. భాషల వారీగా చూస్తే.. హిందీ వెర్షన్ వసూళ్లలో సింహభాగాన్ని దక్కించుకుంది. నిన్న ఒక్కరోజే హిందీలో రూ. 53.75 కోట్లు వసూలు కాగా, కన్నడలో రూ. 5.40 కోట్లు, మలయాళం, తమిళంలో చెరో రూ. 4.75 కోట్లు, తెలుగులో రూ. 4.25 కోట్లు వసూలయ్యాయి. దేశవ్యాప్తంగా సగటున 45.5% ఆక్యుపెన్సీ నమోదు కాగా, మలయాళంలో అత్యధికంగా 83% ఉండటం విశేషం. రణ్‌బీర్ కపూర్ గత చిత్రం 'యానిమల్' పదో రోజు సాధించిన వసూళ్లతో పోలిస్తే 'రామాయణ' కలెక్షన్లు దాదాపు రెట్టింపు స్థాయిలో ఉన్నాయి. 'యానిమల్' ఆ సమయంలో రూ. 36 కోట్లు మాత్రమే వసూలు చేసింది. నితేష్ తివారీ దర్శకత్వంలో నవంబర్ 5న విడుదలైన ఈ చిత్రం, రెండో వారంలోనూ అదే జోరును కొనసాగిస్తూ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను నెలకొల్పుతోంది.

టెకీ నుంచి టాలీవుడ్ హీరోయిన్‌గా.. 'ఆకాశంలో ఒక తార' విశేషాలు పంచుకున్న నటి సాత్విక వీరవల్లి!

స్టార్ నటుడు దుల్కర్ సల్మాన్ హీరోగా, క్రియేటివ్ డైరెక్టర్ పవన్



సాధినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న డిఫరెంట్ ఎమోషనల్ డ్రామా 'ఆకాశంలో ఒక తార'. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్‌బాక్స్ మీడియా బ్యానర్లపై సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్న ఈ చిత్రంలో సాత్విక వీరవల్లి కథానాయికగా పరిచయమవుతుండగా, శ్రుతి హాసన్, రుహాని శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్, సాంగ్స్‌తో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం నవంబర్ 20న తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో హీరోయిన్ సాత్విక వీరవల్లి సినిమా విశేషాలను పంచుకున్నారు. తన నేపథ్యం మరియు ఈ అవకాశం గురించి సాత్విక మాట్లాడుతూ... తాను యూఎస్‌లో పుట్టి పెరిగానని, ఇంజనీరింగ్, మాస్టర్స్ పూర్తి చేసిన తర్వాత రెండేళ్లు ఇంజనీర్‌గా పనిచేశానని తెలిపారు. అయితే క్రియేటివ్ రంగంలోకి రావాలనే ఆసక్తితో మొదట 'కాంత' సినిమాకు ఆడిషన్ ఇచ్చినా కుదరలేదని, ఆ తర్వాత మరో తమిళ సినిమా ఆడిషన్ ద్వారా ఇండియాకు వచ్చానని చెప్పారు. ఆ వెంటనే 'ఆకాశంలో ఒక తార' అవకాశం రావడంతో తన ఉద్యోగాన్ని పక్కనపెట్టి నటన వైపు అడుగులు వేసినట్లు వెల్లడించారు. ఇంట్లో తెలుగు వాతావరణం ఉండటంతో భాష త్వరగానే అలవాటయిందని, ఈ సినిమా కోసం ప్రత్యేకంగా లాంగ్వేజ్ ట్రైనింగ్ కూడా తీసుకున్నానని తెలిపారు. తనకు కర్ణాటక సంగీతంలో ప్రవేశం ఉండటంతోపాటు భరతనాట్యం కూడా నేర్చుకున్నానని చెప్పారు. ఈ చిత్రంలో తన పాత్ర చాలా ప్రశాంతంగా, అమాయకంగా ఉంటుందని, ఎప్పుడూ అంతరిక్షం గురించే ఆలోచించే ఆ అమ్మాయి లక్ష్యం అంతరిక్షంలోకి వెళ్లడమేనని తెలిపారు. చుట్టుపక్కల వాళ్లు ఎంత కించపరిచినా లక్ష్యం వైపే దృష్టి పెట్టే ఈ క్యారెక్టర్ ప్రతి రంగంలో ఉన్నవారికీ స్ఫూర్తినిస్తుందని చెప్పారు. దుల్కర్ సల్మాన్‌తో కలిసి నటించడం చాలా మంచి అనుభూతినిచ్చిందని, మొదటి రోజు జాతర సీన్ షూటింగ్‌లో తాను టెన్షన్ పడినప్పుడు ఆయన ఎంతగానో సపోర్ట్ చేశారని గుర్తుచేసుకున్నారు. శ్రుతి హాసన్ ఒక పవర్‌హౌస్ అని, రుహాని శర్మ ఎంతో సపోర్టివ్‌గా ఉన్నారని వారిద్దరి నుంచి చాలా విషయాలు నేర్చుకున్నానని తెలిపారు. యూఎస్‌లో పెరిగిన తాను ఈ చిత్రంలో విలేజ్ అమ్మాయిగా కనిపించడం ఎంతో ఛాలెంజింగ్‌గా, కొత్త అనుభూతినిచ్చిందని పేర్కొన్నారు. జీవీ ప్రకాష్ కుమార్ అద్భుతమైన సంగీతం అందించారని, షూటింగ్ సమయంలో గంగరాజుతో మాట్లాడి సాహిత్యాంలోని ప్రతి పదానికి అర్థం తెలుసుకునేదాన్ని అని చెప్పారు. ప్రతి మగాడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందని అంటారని, కానీ ఈ సినిమాలో ఒక అమ్మాయి విజయం వెనుక ఒక గొప్ప మనసున్న అబ్బాయి ఉంటాడని, పరస్పరం ప్రోత్సహించుకుంటూ ముందుకు వెళ్తే జీవితం ఎంత అందంగా ఉంటుందో ఈ సినిమా చూపిస్తుందని తెలిపారు. ప్రస్తుతం తాను తమిళంలో ఒక ప్రాజెక్ట్ చేస్తుండగా, తెలుగులోనూ మరో ప్రాజెక్ట్ చర్చల దశలో ఉందని, త్వరలోనే వాటి అధికారిక వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

నవ్వుల విందుకు సిద్ధం



ఎన్టీఆర్ అంటేనే యాక్షన్ పవర్‌హౌస్, ఇక దర్శకుడు అనిల్ రావిపూడి తనదైన కామెడీతో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్విస్తాడు. ఈ ఇద్దరు కలిస్తే ఎలా ఉంటుంది? ఇప్పుడీ అరుదైన కలయికకు రంగం సిద్ధమైంది. ఎన్టీఆర్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో కొత్త సినిమా ప్రకటన వెలువడింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఎన్టీఆర్ తన ఎక్స్‌ఖాతాలో అనిల్ రావిపూడితో దిగిన ఫొటోలను పంచుకున్నారు. 'నవ్వుల విందుకు సిద్ధమవుతోంది' అంటూ ఫొటోకు క్యాప్షన్‌ను జోడించారు. ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై నందమూరి కల్యాణ్‌రామ్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. 'మన కాంబినేషన్ ఎప్పటి నుంచో బాకీ ఉంది తారక్ సర్. పూర్తిస్థాయి కామెడీ సినిమా రాబోతున్నది. త్వరలో రోలింగ్..' అంటూ అనిల్ రావిపూడి తన సోషల్‌మీడియా ద్వారా ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎన్టీఆర్ 'డ్రాగన్' చిత్రంలో నటిస్తున్నారు.ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం జూన్ 11న విడుదలకానుంది. ఈ సినిమా తర్వాత ఎన్టీఆర్-త్రివిక్రమ్ కాంబోలో మైథలాజికల్ 'గాడ్ ఆఫ్ వార్' తెరకెక్కాల్సి ఉంది. అయితే ఈ సినిమా ప్రీపొడక్షన్ పనులకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉండటంతో ఈలోగా అనిల్ రావిపూడితో సినిమాకు సిద్ధమయ్యారు

ఓటీటీలోకి తరుణ్ భాస్కర్ 'క్రేజీ కళ్యాణం'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే!



టాలీవుడ్ యంగ్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్, టాలెంటెడ్ డైరెక్టర్ కమ్ యాక్టర్ తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం 'క్రేజీ కళ్యాణం'. భద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో నరేష్, అఖిల్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. పూర్తి వినోదాత్మకంగా సాగే ఈ సినిమా ఓటీటీ రిలీజ్ డేట్ అధికారికంగా లాక్ అయింది. ప్రముఖ తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫాం 'ఆహా' వేదికగా నవంబర్ 20, 2026 నుంచి ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళ భాషలోనూ ఈ సినిమా ఒకేసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. థియేటర్లలో ప్రేక్షకులను అలరించిన ఈ ఫ్యామిలీ మూవీని త్వరలోనే మీ ఇంటి వద్దే 'ఆహా'లో వీక్షించవచ్చు.

యశ్ మాస్టర్, ధనశ్రీ వర్మ జోడిగా 'హే కన్నమ్మ'.. - టీజర్ విడుదల!



ప్రముఖ టాలీవుడ్ నిర్మాత దిల్ రాజు నిర్మాణంలో, నూతన దర్శకుడు శశికుమార్ ఎం దర్శకత్వంలో తెరకెక్కుతున్న మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ సినిమా 'హే కన్నమ్మ'. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను మేకర్స్ విడుదల చేయడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. మొదట ఈ సినిమాను 'ఆకాశం దాటి వస్తావా' అనే టైటిల్‌తో ప్రకటించినప్పటికీ, కథ మరియు సంగీతానికి తగినట్లుగా ఉండేలా మేకర్స్ ఈ టైటిల్‌ను 'హే కన్నమ్మ'గా మార్చారు. ప్రముఖ కొరియోగ్రాఫర్ యశ్వంత్ (యశ్ మాస్టర్) ఈ చిత్రంతో హీరోగా టాలీవుడ్‌కు పరిచయమవుతుండగా, ప్రసిద్ధ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ మరియు డ్యాన్సర్ ధనశ్రీ వర్మ ఈ సినిమా ద్వారా తెలుగు తెరపై కథానాయికిగా అడుగుపెడుతున్నారు. తాజాగా విడుదలైన టీజర్ అందరినీ ఆకట్టుకునేలా ఉంటూ, డ్యాన్స్ మరియు మ్యూజిక్‌కు ఈ చిత్రంలో ఎంత ప్రాధాన్యత ఉందో స్పష్టం చేస్తోంది. ఈ లవ్ అండ్ రొమాంటిక్ డ్రామాను నవంబర్ 27, 2026 న థియేటర్లలో భారీ ఎత్తున విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.

ఏపీలో తొలిదశ పంచాయతీ ఎన్నికలకు కొనసాగుతున్న నామినేషన్లు



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం కొనసాగుతుంది. ఈనెల 17న సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించ నున్నారు. తొలిదశలో 3,967 పంచాయతీలకు ఈ నెల 26న ఎన్నికలు నిర్వహించనున్నారు. మధ్యాహం 1 గంటల వరకు పోలింగ్, 2 గంటల తరువాత కౌంటింగ్, అనంతరం ఫలితాలను వెల్లడించనున్నారు. మున్సిపల్ , పరిషత్ ఎన్నికల్లో కూటమి విజయం సాధించగా వైసీపీ రెండో స్థానంలో నిలిచింది. అనేక చోట్ల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం నుంచి ఫలితాల వరకు కూటమి ప్రభుత్వానికి పోలీసులు, ఎన్నికల అధికారులు అన్ని విధాలుగా సహకరించారని, రిగ్గింగ్‌కు పాల్పడినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని వైసీపీ నాయకులు ఆరోపించారు. కూటమి యధేచ్ఛగా ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడడంతో వైసీపీ గెలువలేకపోయిందని పేర్కొన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే మెజారిటీ స్థానాల్లో వైసీపీ విజయం సాధించేదని వెల్లడించారు.

క్యూబాలో ఆకలి కేకలు

- ద్వీప దేశం ఆర్థికవ్యవస్థపై అమెరికా ఇంధన ఆంక్షల ప్రభావం

హవానా, : కరీబియన్ సముద్రంలోని ద్వీప సమూహ దేశం క్యూబాలో అధికారంలో ఉన్న సామ్యవాద వ్యవస్థ గత కొన్ని దశాబ్దాలుగా దేశ ప్రజలకు ఉచిత విద్య, ఆరోగ్య సంరక్షణ, రాయితీతో కూడిన ఆహారం, అత్యధికులకు ప్రభుత్వరంగ ఉపాధి అందిస్తూ వచ్చింది. బియ్యం, బీన్స్, పాలపొడి, చికెన్, వంటనూనె, గుడ్ల వంటి ఆహార దిగుమతులపై గతంలో ఏటా 2 బిలియన్ డాలర్లకు (రూ.18,855 కోట్లు) పైగా ఖర్చు చేసేది. దాదాపుగా 99 శాతం అక్షరాస్యత ఉన్న ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలు ఓ మోస్తరుగా ఉన్నా, కనీస అవసరాలకు ఇబ్బంది పడేవారు కాదు. ఇప్పుడు అదంతా గత చరిత్ర. సుమారు కోటీ 10 లక్షల జనాభా గల నేటి క్యూబాను సుదీర్ఘకాలంగా ఆర్థికసంక్షోభం పీడిస్తోంది. అమెరికా ఇంధన ఆంక్షలు, పెరిగిన ద్రవ్యోల్బణం, తరుగుతున్న ప్రభుత్వ వనరులు క్యూబన్ల జీవితాలను తలకిందులు చేస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా ఇంధన ఆంక్షలు ఈ ద్వీప జనజీవనాన్ని దారుణంగా దెబ్బతీశాయి. ఒకప్పుడు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న పర్యాటకరంగం తీవ్రంగా క్షీణించింది.

రాజధాని నగరం హవానాలో ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న ఆహార పంపిణీ కేంద్రం వద్ద వందలాదిగా జనం బారులు తీరుతున్నారు. ఉదయాన్నే ఏడింటికి తలుపులు తెరిచే ఈ కేంద్రంలో పంపిణీ చేసే ఆహారం కోసం కొంతమంది ప్లాస్టిక్ బొచ్చెలతో రాత్రే అక్కడికి చేరుకొని రోడ్డు మీద పడుకొంటున్నారు. "మేము చాలా గడ్డు రోజులు గడుపుతున్నాం" అని ఈ కేంద్రానికి వచ్చిన రిటైర్డ్ సెక్యూరిటీ గార్డు ఫెర్నాండో ఫెర్నాండెజ్ (71) తెలిపారు. "వీరు పంపిణీ చేసే ఆహారంతో నా బిడ్డలకు కనీసం ఒక్కపూటైనా కడుపు నిండుతుంది" అని అయిదుగురు పిల్లల తల్లి మర్లీస్ పాన్స్ (34) చెప్పారు. క్యూబాలో



అక్కడక్కడా స్వచ్ఛంద సంస్థలు నడుపుతున్న ఇటువంటి సామాజిక వంటశాలలే అభద్రతా భావంతో ఉన్న స్థానికులకు జీవనాధారంగా మారాయి. పలు ధార్మిక సంఘాలు, అంతర్జాతీయ సంస్థలు, ఐక్యరాజ్య సమితి ఈ కేంద్రాల ద్వారా ప్రజల ఆకలిని తీరుస్తున్నాయి. ఈ కిచెన్లలో పెద్ద సైజు కడాయిలు పెట్టి అన్నం, గుడ్లు, పాస్తా.. అప్పుడప్పుడు కొద్దిపాటిగా చికెన్ వండుతున్నారు. బాటిళ్లలో చాక్లెట్ పాలను నింపుతున్నారు.

రైల్వే ట్రాక్ పేలుడు కేసులో మహిళ, మరో వ్యక్తి అరెస్ట్

- పాక్‌తో సంబంధాలు



చండీగఢ్: రైలు పట్టాలను పేల్చేసిన కేసులో ఒక మహిళ, ఒక వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె నుంచి రెండు ఆయుధాలు, 46 కాట్రిడ్జ్‌లు, కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ మహిళకు పాకిస్థాన్‌తో సంబంధాలున్నట్లు పోలీస్ దర్యాప్తులో తేలింది. నవంబర్ 3న రాత్రి 9:45 గంటల సమయంలో రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్ జిల్లా రామ్‌సింగ్‌పూర్ సమీపంలోని రైలు పట్టాలపై పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి రెండు రైల్వే స్లీపర్లు ధ్వంసం కావడంతో పాటు రెండున్నర అడుగుల లోతులో ఒక గొయ్యి ఏర్పడింది. అక్కడి రైలు పట్టాలకు నష్టం వాటిల్లింది. ఈ పేలుడుకు 75 నిమిషాల ముందు అనూప్‌గఢ్-సూరత్‌గఢ్ ప్యాసింజర్ రైలు ఈ ట్రాక్‌పై ప్రయాణించింది.

నిందితులు ఈ రైలును పేల్చేందుకు కుట్ర పన్నినట్లు పోలీసులు అనుమానించారు. కాగా, రాజస్థాన్ ఉగ్రవాద నిరోధక దళం (ఏటీఎస్), శ్రీ గంగానగర్ పోలీసులు, పంజాబ్ పోలీసులు సంయుక్తంగా దీనిపై దర్యాప్తు చేపట్టారు. పాకిస్థాన్‌తో సంబంధాలున్న 21 ఏళ్ల మహాక్‌దీప్ కౌర్, ఆమెకు సహకరించిన 22 ఏళ్ల దవీందర్ సింగ్‌ను పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాలో అరెస్ట్ చేశారు. ప్రస్తుతం మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో జైలులో ఉన్న భర్త నుంచి విడిపోయిన కౌర్ వేరుగా నివసిస్తున్నదని పోలీస్ అధికారి తెలిపారు. పాకిస్థాన్‌లోని ఇద్దరు హ్యాండ్లర్లతో ఆమెకు సంబంధాలున్నాయని చెప్పారు. వారిలో ఒకరిని 'చాచా' అని, మరొకరిని 'షా' అని పిలుస్తారని వివరించారు. మరోవైపు పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ హ్యాండ్లర్లు కౌర్‌తో ప్రేమపూర్వక సంభాషణలో పాల్గొని, ఆమెను ట్రాప్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. రైల్వే ట్రాక్‌పై పేలుడు జరిపేందుకు పాక్ హ్యాండ్లర్ల నుంచి ఆమె డబ్బు తీసుకున్నట్లుగా విచారణలో తేలిందని చెప్పారు. కౌర్ నుంచి రెండు ఆయుధాలు, 46 కాట్రిడ్జ్‌లు, రూ. 30,000 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులకు వసతి, బైక్, నేర స్థలానికి రవాణా సౌకర్యం కల్పించి సహకరించిన మరో ముగ్గురిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.

మద్యం మత్తులో పోలీసుల కారు బీభత్సం


కాసిపేట , : మంచిర్యాల జిల్లా కాసిపేట మండల కేంద్రంలో పోలీసు సిబ్బంది ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైన ఘటన కలకలం రేపింది. దేవాపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు, హోంగార్డు మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపి రహదారి పక్కన నిలిపి ఉంచిన ట్రాలీని ఢీకొట్టినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కారు బలంగా ఢీకొనడంతో ట్రాలీతో పాటు వాహనం కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి.

కారు ఎయిర్‌బ్యాగులు తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాద సమయంలో ట్రాలీలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అక్కడికి చేరుకుని కారులో ఉన్న పోలీస్ సిబ్బందిని నిలదీశారు. ట్రాలీకి మరమ్మతులు చేయిస్తామని తొలుత హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. అయితే ఆ తర్వాత నష్టపరిహారం చెల్లించబోమని ట్రాలీ యజమాని చింతల సాగర్‌ను బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో బాధితుడు శుక్రవారం రాత్రి కాసిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలోనే ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డైనట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో కారులో దేవాపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు, హోంగార్డు ఉన్నారని బాధితులు పేర్కొంటున్నారు. తొలుత పరిహారం చెల్లిస్తామని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయిన వారు, మరుసటి రోజు మాట మార్చారని ఆరోపిస్తున్నారు. నష్టపరిహారం అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోతున్నారు. అంతేకాకుండా పోలీసు సిబ్బంది కావడంతో ప్రమాద సమయంలో కారు నడిపిన అసలు వ్యక్తిని పక్కనపెట్టి, మరొకరిని డ్రైవర్‌గా చూపించే ప్రయత్నం జరుగుతోందనే అనుమానాలను బాధితులు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై కాసిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు శాఖలో పనిచేస్తున్న సిబ్బందిపైనే మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమయ్యారనే ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. ఇదే వేగంతో రహదారిపై వెళ్తున్న వాహనదారులను ఢీకొట్టి ఉంటే ప్రాణనష్టం జరిగి ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని, సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించి వాస్తవాలను నిగ్గుతేల్చాలని బాధితుడు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు సిబ్బందిపై విచారణ జరిపి, తప్పు చేసినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మరో సమరానికి సిద్ధం

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి పురపాలక సమరం ప్రారంభమయింది. న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోవడంతో రాష్ట్రంలోని 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 15 మున్సిపాలిటీలు, 4 నగర పంచాయతీలతో కలిపి మొత్తం 23 పట్టణ స్థానిక సంస్థలకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. నవంబర్ 26న పోలింగ్, నవంబర్ 30న కౌంటింగ్ జరగనున్న ఈ ఎన్నికలు ఇప్పుడు అధికార ఎన్డీయే కూటమికి, విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మకంగా మారాయి. ముఖ్యంగా ఈ 4 కార్పొరేషన్ల మేయర్ స్థానాల కేటాయింపులో కూటమి పార్టీలు అనుసరించిన వ్యూహం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా నిలిచింది.అధికార కూటమి భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య కుదిరిన సీట్ల సర్దుబాటు ప్రకారం.. ఎన్నికలు జరగనున్న నాలుగు కార్పొరేషన్లలో తెలుగుదేశం పార్టీ కేవలం ఒక్క చోట మాత్రమే మేయర్ పీఠానికి పోటీ చేస్తోంది. రాజధాని ప్రాంతంలోని అత్యంత కీలకమైన మంగళగిరి?తాడేపల్లి కార్పొరేషన్‌ను టీడీపీ తన వద్ద ఉంచుకోగా.. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం , గోదావరి జిల్లాలోని కాకినాడ కార్పొరేషన్లను జనసేన పార్టీకి కేటాయించింది. ఇక చారిత్రాత్మక రాజమహేంద్రవరం మేయర్ స్థానాన్ని బీజేపీకి వదిలేసింది. టీడీపీ కేవలం ఒక్క కార్పొరేషన్‌లోనే నేరుగా బరిలో నిలిచి, మిగిలిన మూడు కీలక నగరాలను మిత్రపక్షాలకు కేటాయించడం కూటమి ఐక్యతకు నిదర్శనమని అధికార వర్గాలు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో టీడీపీ కేడర్ సహకారం ఏ మేరకు ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది. అనంతపురం మేయర్ స్థానాన్ని ఉదాహరణగా చెబుతున్నారు.సరిగ్గా ఇదే అంశం ఇప్పుడు ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఒక సువర్ణావకాశంగా మారిందని భావిస్తున్నారు. ఇటీవల జరిగిన 100 పురపాలక సంస్థల ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాక ఒకింత ఆత్మరక్షణలో పడిన వైసీపీ.. ఈ పెండింగ్ 23 సంస్థల ఎన్నికలను తమ సత్తా చాటుకునే వేదికగా మలచుకోవాలని చూస్తోంది. ముఖ్యంగా జనసేన, బీజేపీ పోటీ చేస్తున్న శ్రీకాకుళం, కాకినాడ, రాజమహేంద్రవరం కార్పొరేషన్లలో టీడీపీ ఓటు బ్యాంకు బదిలీలో ఏమాత్రం లోటుపాట్లు జరిగినా, లేదా కూటమిలో అసమ్మతి తలెత్తినా దాన్ని పూర్తిగా సొమ్ము చేసుకుని మేయర్ పీఠాలను కైవసం చేసుకోవాలని తాడేపల్లి నాయకత్వం పక్కా వ్యూహాలు రచిస్తోంది. ఒకవేళ ఈ 4 కార్పొరేషన్లలో కనీసం రెండు, మూడు మేయర్ పీఠాలతో పాటు 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో మెరుగైన ఫలితాలను వైసీపీ సాధించగలిగితే.. అది ఆ పార్టీకి భారీ పొలిటికల్ మైలేజ్ ఇవ్వనుంది. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది.. వైసీపీ మళ్లీ బలంగా పుంజుకుంటోంది అనే బలమైన రాజకీయ సందేశాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే అవకాశం జగన్ మోహన్ రెడ్డికి లభిస్తుంది. 2024 అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత నిస్తేజంలో ఉన్న పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపడానికి ఈ విజయాలు ఒక బూస్టర్ డోస్ లా పనిచేస్తాయని వైసీపీ నేతలు లెక్కలు వేసుకుంటున్నారు. అధికార కూటమి కూడా ఈ సమీకరణాలను ముందే పసిగట్టి అప్రమత్తమైంది. టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు ఎక్కడ పోటీ చేసినా అది కూటమి ఉమ్మడి అభ్యర్థిగానే భావించి, మూడు పార్టీల శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మొదటి విడతలో 100 స్థానాలలో సాధించిన ఏకపక్ష విజయాలను ఈ 23 స్థానాల్లోనూ పునరావృతం చేసి, వైసీపీకి ఎక్కడా పుంజుకుంటున్నాం అని చెప్పుకునే ఛాన్స్ ఇవ్వకూడదని కూటమి పట్టుదలతో ఉంది. నవంబర్ 26న జరగనున్న ఈ 23 పట్టణ స్థానిక సంస్థల పోరు కేవలం స్థానిక ఎన్నికలకే పరిమితం కాకుండా, రాష్ట్ర రాజకీయ దిశను సూచించే లిట్మస్ టెస్ట్‌గా మారింది. మిత్రపక్షాలకు మూడు మేయర్ పీఠాలను వదిలేసిన కూటమి వ్యూహం ఫలిస్తుందా, లేక ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని వైసీపీ తన పునరాగమనాన్ని ఘనంగా ప్రకటించుకుంటుందా అనేది నవంబర్ 30న వెలువడే ఫలితాల్లో తేలనుంది.

కలహాల కూటమి




అనంతపురం, స్థానిక ఎన్నికల పోలింగ్ ముగిసిపోయి.. ఫలితాలు కూడా వచ్చేసిన విషయం తెలిసిందే. ఇక, మరో వారంలో కొత్త మేయర్లు, కొత్త కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం కూడా చేయనున్నారు. అలానే మునిసిపాలిటీలలో చైర్మన్‌లు, కౌన్సిలర్లు కూడా.. బాధ్యతలు చేపట్టేందుకు రెడీ అయ్యారు. ఇదిలావుంటే.. ఎన్నికల సమయంలో కొందరు టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు పరాజయం పాలయ్యారు. వీరి వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తమ పార్టీ నాయకులు అనుసరించిన విధానాల వల్లే తాము ఓడామంటూ.. తమ తమ పార్టీలకు చెందిన సీనియర్ నాయకు లనే ఓడిపోయిన వారు విమర్శిస్తున్నారు.. దీంతో టీడీపీలో నాయకులకు-నాయకులకు మధ్య అంతర్యుద్ధం పెరుగుతోంది. తాజాగా గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుపై స్థానిక టీడీపీ నాయకులు, ముఖ్యంగా స్థానికంలో ఓడిపోయిన వారు తీవ్ర విమర్శలు గుప్పించారు. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన యార్లగడ్డ.. ఇప్పటికీ వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని వారు ఆరోపించారు. ఇటీవల గన్నవరంలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ భారీగా పుంజుకుంది. గత ఎన్నికల్లో ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ వర్గం ఇక్కడ పుంజుకుంది. ఈ పరిణామాలపైనే ఓడిపోయిన వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. అందుకే వారు విజయం దక్కించుకున్నారని కొందరు విమర్శలు గుప్పించారు. ఈ పరిణామాలపై ఎమ్మెల్యే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "నాకు అవమానాలు, విమర్శ లు కొత్త కాదు. దశాబ్దం కాలంగా నేను గన్నవరం లో ఏం చేశానో అభిమానులు, కార్యకర్త లకు తెలుసు. ఎవడు పడితే వాడు ఏదొకటి మాట్లాడుతున్నాడు జగన్నవరంలో 63 ఓట్ల తో బిజెపి జడ్పీటీసీ సభ్యులు ఓడిపోతే అవతల పక్షం పొంగిపోతోంది. పొత్తలకారణంగా మిత్ర ధర్మం వల్ల యాభై శాతం సీట్లు బిజెపికి కేటాయించా. మన అభ్యర్థులు ఓడిపోవడం నాకు కూడా చాలా బాధ కలిగించింది." అని పేర్కొన్నారు. అనంతపురంలో కూడా ఇలాంటి వివాదమే జరుగుతోంది. అనంత కార్పొరేషన్ పీఠాన్ని వైసీపీ సొంతం చేసుకుంది. దీనికి కారణాలను టీడీపీ అన్వేషిస్తోంది. అయితే.. స్థానిక ఎమ్మెల్యే కారణంగానే వైసీపీ విజయం దక్కించుకుందని టీడీపీ నాయకులు బహిరంగ విమర్శలు చేశారు. ఇక్కడి మేయర్ పీఠాన్ని బీజేపీకి కేటాయించారు. అయితే.. సమన్వయ లోపంతోనే ఓడినట్టు చంద్రబాబుకు కూడా నివేదికలు అందాయి. ఇంతలోనే ఎమ్మెల్యేపై నాయకులు విమర్శలు గుప్పిస్తూ.. సోషల్ మీడియాలో తీవ్ర వ్యాఖ్యలు గుప్పించారు.

అమరావతిలో మెగా రైల్వేస్టేషన్

అమరావతి : రాజధాని అమరావతి రైల్వే కనెక్టివిటీ ప్రాజెక్టుకి కదలిక వచ్చింది. రాష్ట్రంలో ఇతర ప్రాంతాలతో రాజధానిని అనుసంధానించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రతిపాదించిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం కోర్ క్యాపిటల్ ప్రాంతంలో రైల్వే లైన్లు, ఇతర మౌలిక సదుపాయాలు లేకపోవడంతో అమరావతి రైల్వే ప్రాజెక్టు ఇన్నాళ్లు ప్రతిపాదనలకే పరిమితమైంది. అయితే ఇటీవల రైల్వేశాఖతో జరిగిన సంప్రదింపులతో అమరావతి రైలు మార్గంపై తుది నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. కొద్దిపాటి మార్పులతో రైల్వే మార్గాన్ని ఖరారు చేశారని అంటున్నారు. ఇందులో భాగంగా రాజధాని ప్రాంతంలోని తాడికొండకు సమీపంలో కోర్ క్యాపిటల్ ప్రాంతంలో అమరావతి రైల్వేస్టేషన్ నిర్మించాలని నిర్ణయించారు. గతంలో రాజధాని కోసం 56.53 కి.మీ. మేర కొత్త రైల్వే లైను నిర్మించాలని భావించారు. అయితే తాజాగా చేసిన మార్పులతో 58.1 కి.మీ మేర రైల్వే మార్గం నిర్మాణానికి నిర్ణయించినట్లు చెబుతున్నారు. తాడికొండకు 5 కిలోమీటర్ల దూరంలో కోర్ క్యాపిటల్ ప్రాంతంలో నిర్మించనున్న రైల్వేస్టేషన్ పై కీలక అప్డేట్ వచ్చింది. విమానాశ్రయ టెర్మినల్ తరహాలో అత్యంత ఆధునిక సదుపాయాలతో భారీ రైల్వేస్టేషన్ నిర్మించనున్నారని చెబుతున్నారు. ఇందులో సుమారు 24 ప్లాట్‌ఫారాలు, నాలుగు టెర్మినళ్లు ఉంటాయని చెబుతున్నారు. అంతేకాకుండా రోజుకు 3 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యంతో ఈ మెగా రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలనే ప్రతిపాదిస్తున్నారు. ఈ ప్రతిపాదనకు తుది ఆమోదం లభిస్తే ప్రస్తుతం రాష్ట్రంలో అత్యధిక ప్లాట్‌ఫారాలు ఉన్న విజయవాడ, విశాఖపట్నం స్టేషన్లను దాటి అమరావతి ఆంధ్రప్రదేశ్‌లోనే అతిపెద్ద రైల్వే స్టేషన్‌గా నిలవనుందని చెబుతున్నారు. రాజధాని ప్రాంతాన్ని ప్రధాన రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించేందుకు ఎర్రుపాలెం ? అమరావతి ? నంబూరు మధ్య 57 కిలోమీటర్ల సింగిల్ బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్‌ను నిర్మిస్తున్నారు. 2024 అక్టోబర్ 24న కేంద్ర క్యాబినెట్ ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపినప్పుడు దీని ప్రారంభ అంచనా వ్యయాన్ని ?2,245 కోట్లుగా పేర్కొన్నారు. ఆ తర్వాత 2025 ఆగస్టులో లోక్‌సభలో ఇచ్చిన అధికారిక సమాధానంలో ఈ ప్రాజెక్టు సవరించిన అంచనా వ్యయాన్ని ?2,047 కోట్లుగా రైల్వే శాఖ స్పష్టం చేసింది. ఈ 57 కిలోమీటర్ల మార్గంలో అమరావతి సహా మొత్తం తొమ్మిది కొత్త రైల్వే స్టేషన్లను నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ రైల్వే మార్గంలో కృష్ణా నదిపై నిర్మించబోయే భారీ వంతెన అత్యంత కీలకమైనది. గతంలో ఈ బ్రిడ్జి పొడవు 3.2 కిలోమీటర్లుగా ప్రచారంలో ఉన్నప్పటికీ, తాజా నివేదికల ప్రకారం కృష్ణా నదిపై సుమారు 3.38 కిలోమీటర్ల పొడవైన రైల్వే వంతెనను నిర్మించనున్నారు. కేవలం ఈ వంతెన, దాని అప్రోచ్ పనుల కోసమే రూ.565.83 కోట్ల అంచనా వ్యయాన్ని కేటాయించారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల మధ్య రైల్వే కనెక్టివిటీ మరింత బలోపేతం అవుతుందని చెబుతున్నారు. అంతేకాకుండా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి ప్రధాన మెట్రో నగరాల నుంచి అమరావతికి నేరుగా రైల్వే కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుంది. దీనివల్ల విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులకు ప్రయాణ సమయం, ఖర్చు ఆదా అవ్వడమే కాకుండా, అమరావతి పరిసర ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలు, రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుని స్థానికులకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం చెబుతోంది. భవిష్యత్తులో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో అమరావతి ఒక ప్రధాన రైల్వే హబ్‌గా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.ప్రస్తుతం ఈ రైల్వే లైన్ ప్రాజెక్టు టెండర్ల దశలో ఉంది. 57 కిలోమీటర్ల మార్గాన్ని నాలుగు ప్యాకేజీలుగా విభజించి పనులు చేపట్టేందుకు రైల్వే శాఖ చర్యలు తీసుకుంటోంది. 2026 అక్టోబర్ నాటికి టెండర్ల ప్రక్రియ కొనసాగుతుండగా, చివరి ప్యాకేజీ బిడ్ల దాఖలుకు నవంబర్ 23 తుది గడువుగా నిర్ణయించారు. బిడ్ల పరిశీలన, ఖరారు ప్రక్రియ ముగిసిన తర్వాతే క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తుండటంతో ఈ ప్రాజెక్టులో కదలిక వచ్చింది. కేంద్ర రైల్వే శాఖ నిధుల కేటాయింపు, సాంకేతిక అనుమతులు చూస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం వేగంగా భూసేకరణ పూర్తి చేసి అప్పగించాల్సి ఉంది. సాధారణంగా దేశంలో రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం భూసేకరణ, నిధుల కొరత వంటి కారణాలతో నత్తనడకన సాగుతుంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చిత్తశుద్ధితోనే ప్రాజెక్టులు వేగంగా పూర్తవుతాయని అంటున్నారు. ఎప్పటికప్పుడు అవసరమైన నిధులను విడుదల చేస్తూ, క్షేత్రస్థాయి అడ్డంకులను తొలగిస్తేనే ప్రాజెక్టు అనుకున్న సమయానికి పట్టాలెక్కుతుంది. అమరావతికి కొత్త రైల్వే లైన్ అందుబాటులోకి రావడం రాజధాని అభివృద్ధిలో కీలక అడుగుగా భావిస్తున్నారు. అయితే భారీ రైల్వే స్టేషన్ ప్రతిపాదనలు ఎప్పుడు ఆమోదం పొందుతాయి? నిర్మాణం ఎప్పుడు ప్రారంభమవుతుంది? ప్రయాణికులకు ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తుంది? అన్నది ఆసక్తికరంగా మారింది.

గ్యాస్ రిఫైనరీ ఉద్యోగుల బస్సు బోల్తా.. 12 మంది దుర్మరణం..!



గ్యాస్ రిఫైనరీ సంస్థకు చెందిన ఉద్యోగులతో వెళ్తున్న ఓ బస్సు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 12 మంది ఉద్యోగులు దుర్మరణం పాలయ్యారు. మరో 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారంతా ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పశ్చిమ ఇరాన్ లోని ఇరాక్ సరిహద్దుకు సమీపంలో అబ్దనాన్, డెహ్లోరాన్ (ూఎఝఋఝఅ, ఐవప్తశ్రీశీఋఅ) మధ్య ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం విషయాన్ని ఇరాన్ మీడియా వెల్లడించింది. ఈ ప్రమాదంపై దర్యాప్తు జరుగుతున్నదని తెలిపింది. గాయాల తీవ్రత దృష్ట్యా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అక్కడి అధికారులు వెల్లడించారు. కాగా ఇరాన్‌లో రహదారి భద్రత రికార్డు చాలా పేలవంగా ఉంది. మార్చి వరకు గడిచిన 12 నెలల్లో రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 20 వేల మంది ప్రాణాలు కోల్పోయారని అధికారిక ఇరానియన్ లీగల్ మెడిసిన్ ఆర్గనైజేషన్ జూన్‌లో తెలిపింది.

క్యూరింగ్ లేని సీసీ రోడ్డు
కుంగిపోతున్న నాణ్యత

- తార్నాక విజయపురి కాలనీలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం - అధికారుల ఆర్థిక మౌనమా.?



తార్నాక (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ నియోజకవర్గంలో సిసి రోడ్లు అంటే చాలు ఇంజనీరింగ్ అధికారులకు కాంట్రాక్టర్లకు కాసుల పంటల మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాణ్యత గాలికే, బిల్లు మాత్రం జేబుకు అన్నట్లుగా మారింది పరిస్థితి. రోడ్డు తవ్వడం నెలల కొద్ది అలాగే వదిలివేయడం ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తే అప్పుడు రోడ్డు వేయడం ఈ దుస్థితి ఏఈ, డిఈ, ఈఈ, ఎస్ ఈ వరకు పూర్తి నిర్లక్ష్యంతో జరుగుతుందని ప్రజల విమర్శిస్తున్నారు. ఇక తార్నాక విజయపురి కాలనీ లో రోడ్డు వేశారు. కానీ నీళ్లు పోయడం లేదు, సిమెంట్ రోడ్డుకు ప్రాణం పోసేదే క్యూరింగ్. అదే చేయకుండా కాంట్రాక్టర్ వదిలేస్తే ఆ రోడ్డు ఎన్ని రోజులు మన్నిక గలుగుతుంది.? మెట్టుగూడ సర్కిల్ పరిధిలోని తార్నాక విజయపురి కాలనీలో ఇప్పుడు ఇదే ప్రశ్న స్థానికులను వేధిస్తోంది.కోట్ల రూపాయల ప్రజాధనంతో వేసిన సీసీ రోడ్డు, వేసిన వారం రోజులకే పగుళ్లు వచ్చే పరిస్థితికి చేరుకుందని, కారణం కేవలం కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపమేనని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్యూరింగ్ అంటే ఏంటో తెలియదా.?

సీసీ రోడ్డు వేసిన తర్వాత కనీసం 14 రోజుల పాటు నిరంతరం నీళ్లు పోస్తూ క్యూరింగ్ చేయాలి. సిమెంటుతో కట్టలు కట్టి ఎప్పుడు నీటితో తడిగా ఉంచాలి. లేదంటే సిమెంట్ సరిగా గట్టిపడదు. పైకి గట్టిగా కనిపించినా లోపల డొల్లగా తయారై, నెల తిరగకుండానే పగుళ్లు వచ్చి, పొడిగా రాలిపోతుంది. విజయపురి కాలనీలో జరిగింది అదే. రోడ్డు వేశారు. ఫోటోలు తీసుకున్నారు. తర్వాత కాంట్రాక్టర్ మళ్లీ ఆ వైపు కన్నెత్తి కూడా చూడలేదని స్థానికులు చెబుతున్నారు. రోడ్డు పైన ఎండకు ఎండిపోయి, అక్కడక్కడా గోనె సంచులు చిరిగి పడి ఉన్న దృశ్యమే దీనికి సాక్ష్యం. ఇరువైపులా మట్టి కూడా పోయలేదు. రోడ్డుకు ఇరువైపులా అంచులు ఖాళీగా, గుంతలుగా ఉండటంతో వాహనాలు వెళితే రోడ్డు అంచులు విరిగిపోయే ప్రమాదం ఉంది.

అధికారుల నిర్లక్ష్యం, ఇది మొదటిసారి కాదు..

ఇది ఒక్క విజయపురి కాలనీ సమస్య కాదు. తార్నాక, మెట్టుగూడ సర్కిల్లో మొత్తంలో ఇదే తంతు నడుస్తోంది అని స్థానికులు మండిపడుతున్నారు. గతంలో కూడా ఇదే సర్కిల్ లో వేసిన చాలా సీసీ రోడ్లు నాణ్యత లేకుండా వేశారని, ఆరు నెలలు కూడా తిరగకుండానే పగుళ్లు,గుంతలు పడ్డాయని, మట్టితో బర్మా నింపలేదని స్థానికులు గుర్తుచేస్తున్నారు. కాంట్రాక్టర్ కు ఇంజనీరింగ్ అధికారులు కొమ్ము కాస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పనులు జరుగుతున్నప్పుడు సైట్ కు వచ్చి చూడాల్సిన ఏఈ, డీఈలు రావడం లేదని, వచ్చినా కంటి తుడుపుగా చూసి వెళ్లిపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. క్వాలిటీ చెక్, క్యూబ్ టెస్ట్, క్యూరింగ్ రిపోర్ట్, ఏదీ సరిగా లేకుండానే బిల్లులు మంజూరు అవుతున్నాయా.? అన్న అనుమానం కాలనీవాసుల్లో వ్యక్తమవుతోంది.

మామూళ్ల మత్తులో అధికారులన్న ప్రజల ఆరోపణలు

ఉన్నతాధికారులకు సైతం కాంట్రాక్టర్ "మామూళ్లు" ఇస్తుండటం వల్లే సికింద్రాబాద్ నియోజకవర్గ మొత్తంలో నాణ్యతలేని పనులు జరుగుతున్నాయని కొందరు స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణల్లో నిజమెంత ఉందో ఉన్నతాధికారులు విజిలెన్స్ విచారణ జరిపి తేల్చాల్సి ఉంది. కానీ ప్రజల్లో జిహెచ్ఎంసి లో మాత్రం డబ్బులు ఇస్తే ఏ పనైనా చెల్లుబాటు అవుతుంది. అనే భావన బలంగా నాటుకుపోయింది. ఇది జీహెచ్ఎంసీ పరువుకు పెద్ద దెబ్బగా మారిందని ఉన్నత అధికారుల నిర్లక్ష్యమే కారణమన్న విమర్శలు తినిపిస్తున్నాయి.

ఎప్పుడు ప్రజల సొమ్ము వృథా..

మీటర్లలో సీసీ రోడ్డుకు లక్షల రూపాయలు ఖర్చు అవుతుంది. అది ప్రజలు కట్టిన పన్నుల డబ్బు. క్యూరింగ్ చేయకపోవడం వల్ల ఆ డబ్బు మొత్తం వృథా అవుతుంది. ఈ రోడ్డు ఆరు నెలల్లో పాడైతే, మళ్లీ అదే రోడ్డుకు మళ్లీ టెండర్, మళ్లీ కోట్ల ఖర్చు. నష్టపోయేది చివరకు సామాన్యుడే. వృద్ధులు, చిన్న పిల్లలు, ద్విచక్ర వాహనదారులు ఈ అసంపూర్తి రోడ్డు మీద నడవడానికి భయపడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా మట్టి లేకపోవడంతో రోడ్డు ఎత్తుగా, పక్కన లోతుగా ఉండి, జారి పడే ప్రమాదం ఉంది. రాత్రి వేళ లైట్లు సరిగా లేకపోవడంతో ప్రమాదం మరింత పెరుగుతోంది.

ఇప్పటికైనా ఉన్నత అధికారులు ఏం చేయాలి.?

అధికారులు స్పందించి వెంటనే క్యూరింగ్ ప్రారంభించాలని రోడ్డుకు ఇరువైపులా మట్టి పోసి అంచులు గట్టిగా చేయాలి. జేఎన్టీయూ అధికారులచే నాణ్యత పరీక్షలు నిర్వహించి, రిపోర్టు బహిరంగపరచాలని నిర్లక్ష్యం చేసిన కాంట్రాక్టర్, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.జీహెచ్ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్ వెంటనే స్పందించి, ఈ రోడ్డును పరిశీలించి, నాణ్యత లేకుంటే కాంట్రాక్టర్ తోనే మళ్లీ వేయించాలని స్థానికులు కోరుతున్నారు. లేదంటే "క్యూరింగ్ లేని రోడ్డు – కరిగిపోతున్న ప్రజాధనం" అన్న పేరు మెట్టుగూడ సర్కిల్ కు శాశ్వతంగా మిగిలిపోతుందని వారు హెచ్చరిస్తున్నారు.

రైతన్న..తప్పదా మనకు తిప్పలు

- పంటలు పండక రైతన్న కన్నీళ్లు - కూలి పనులు దొరకక వ్యవసాయ కార్మికుల అగచాట్లు
- అప్పుల ఊబిలో అన్నదాత.. ఉపాధి కరువై కూలీ కుటుంబాల అవస్థలు.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు తప్పని గడ్డుకాలం

"రైతు కష్టపడితేనే దేశానికి అన్నం దొరుకుతుంది. అలాంటి రైతన్న నేడు తన కుటుంబాన్ని పోషించుకోవడానికి నానా అవస్థలు పడుతున్నాడు. ఆకాశం వైపు ఆశగా చూసినా వర్షాలు కురవడం లేదు.. భూమి తల్లిని నమ్ముకుని బోర్లు వేయించినా ఆశించిన స్థాయిలో నీరు లభించడం లేదు. అప్పులు చేసి బోర్లు వేయించిన కొందరు రైతులకు నీరు పడక నిరాశే మిగులుతుండగా, మరికొందరికి నీరు ఉన్నా పంటలు ఆశించిన స్థాయిలో పండక పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదుబకప్పడు పచ్చని పంట పాలాలతో కళకళలాడిన గ్రామీణ ప్రాంతాల్లో నేడు రైతుల ముఖాల్లో ఆందోళన కనిపిస్తోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పంట చేతికి వస్తుందో లేదో తెలియని పరిస్థితుల్లో రైతులు వ్యవసాయం కొనసాగించాలా.? వద్దా.? అనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు"





మేడ్చల్ (ప్రశ్ననూస్) వ్యవసాయానికి నీరే ప్రాణాధారం. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో భూగర్భ జలాలపై ఆధారపడుతున్న రైతులు అప్పులు చేసి బోర్లు వేయిస్తున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసినా కొన్ని చోట్ల నీటి జాడ కనిపించడం లేదు. మరికొన్ని చోట్ల నీరు వచ్చినా పంటలకు సరిపడా అందడం లేదు. దీంతో రైతులకు పెట్టుబడి భారం పెరిగి ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతోంది. బోరు బావి కోసం చేసిన అప్పు ఒకవైపు.. పంట కోసం పెట్టిన పెట్టుబడి మరోవైపు.. రైతన్నకు రెండువైపులా కష్టాలే ఎదురవుతున్నాయి.

పంటలు పండక.. కూలి పనులు లేక..

రైతు కష్టాలు కేవలం రైతు కుటుంబానికే పరిమితం కావడం లేదు. వ్యవసాయంపై ఆధారపడి జీవించే కూలీల జీవితాలపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పొలాల్లో పనులు లేకపోవడంతో రోజువారీ కూలీపై ఆధారపడే కుటుంబాలకు ఉపాధి కరువవుతోంది. నాట్లు, కలుపు తీయడం, కోతలు వంటి పనులు తగ్గిపోవడంతో చేతినిండా పని దొరకని పరిస్థితి నెలకొంటోంది.రోజంతా పని కోసం ఎదురుచూసినా పని దొరకక ఖాళీ చేతులతో ఇంటికి వెళ్లాల్సి వస్తోంది. ఇంటి అద్దె, పిల్లల చదువులు, నిత్యావసర సరుకులు, వైద్య ఖర్చులు ఎలా భరించాలో తెలియక కూలీ కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం..

రైతు చేతిలో డబ్బు ఉంటేనే గ్రామాల్లో వ్యాపారం సాగుతుంది. వ్యవసాయ కూలీలకు పని దొరికితేనే వారి కుటుంబాల్లో కొనుగోలు శక్తి పెరుగుతుంది. కానీ రైతుకు పంట దిగుబడి లేక, కూలీకి ఉపాధి లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు మందగిస్తున్నాయి. చిన్న దుకాణాలు, చిరు వ్యాపారులు, వ్యవసాయ పనిముట్ల విక్రేతలు సైతం ఈ ప్రభావాన్ని ఎదుర్కొంటున్నారు.

ప్రభుత్వాలు స్పందించాల్సిన సమయం ఇదే..

రైతుల సమస్యలను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉంది. నీటి లభ్యతను బట్టి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి. నీటి పొదుపు పద్ధతులు, డ్రిప్, స్ప్రింక్లర్ సాగుకు ప్రోత్సాహకాలు అందించాలి. పంట నష్టాలను పారదర్శకంగా అంచనా వేసి అర్హులైన రైతులకు పరిహారం అందించాలి. ఉపాధి కోల్పోతున్న వ్యవసాయ కూలీలకు గ్రామీణ ఉపాధి హామీ పనులు అందుబాటులోకి తీసుకురావాలి.అదేవిధంగా బోర్లు వేయించే ముందు భూగర్భ జలాల పరిస్థితిపై శాస్త్రీయ అవగాహన కల్పించి, అనవసరంగా అప్పులపాలయ్యే పరిస్థితిని నివారించాలి.

రైతు బతికితేనే వ్యవసాయం.. కూలీ బతికితేనే గ్రామం..

రైతు పొలంలో పంట పండకపోతే కేవలం ఒక కుటుంబమే నష్టపోదు.. ఆ పంటపై ఆధారపడిన అనేక కుటుంబాల జీవనాధారం దెబ్బతింటుంది.

రైతన్నకు గిట్టుబాటు ధర, సాగునీటి భరోసా, పెట్టుబడి సహాయం ఎంత అవసరమో.. వ్యవసాయ కూలీలకు నిరంతర ఉపాధి కూడా అంతే అవసరం.బోర్లు వేసి అప్పులపాలైన రైతన్నకు భరోసా ఎవరు? పంటలు లేక పనులు కోల్పోయిన కూలీ కుటుంబాలకు అండగా నిలిచేది ఎవరు? అన్నదాత కన్నీళ్లు తుడిచి, కూలీ కుటుంబాలకు ఉపాధి కల్పించినప్పుడే గ్రామీణ వ్యవస్థకు నిజమైన భరోసా లభిస్తుంది. రైతు కష్టాన్ని గుర్తించాలి.. కూలీ శ్రమకు గౌరవం ఇవ్వాలి.. వ్యవసాయాన్ని, వ్యవసాయంపై ఆధారపడిన ప్రతి కుటుంబాన్ని కాపాడాలి.

మేయర్, మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థుల ఖరారు

- మంగళగిరి కార్యాలయం నుంచి అధికారిక ప్రకటన విడుదల



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లోని రెండు మున్సిపల్ కార్పొరేషన్లు, మూడు మున్సిపాలిటీలలో మేయర్, ఛైర్మన్ స్థానాలకు పోటీ చేసే జనసేన అభ్యర్థులను పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఖరారు చేశారు. ఇటీవల ఎన్నికలు జరగ్గా మిగిలిన పట్టణ స్థానిక సంస్థలకు నవంబరు 26న పోలింగ్ జరగనుంది. 4 కార్పొరేషన్లు, 16 మున్సిపాలిటీలు, 3 నగర పంచాయతీలకు ఈ విడతలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే బీజేపీ తాను పోటీ చేసే స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. తాజాగా ఈ ఎన్నికల్లో బరిలో దిగే తమ అభ్యర్థుల పేర్లను ఖరారు చేసినట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం సాయంత్రం అధికారికంగా వెల్లడించింది. శ్రీకాకుళం, కాకినాడ కార్పొరేషన్లలో మేయర్ పదవుల కోసం మహిళా నేతలకు పార్టీ నాయకత్వం అవకాశం కల్పించింది. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా డాక్టర్ దానేటి రాధారాణిని ఎంపిక చేశారు. అలాగే కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా ఆకుల భవాని పేరును పవన్ కల్యాణ్ ఖరారు చేశారు.మున్సిపాలిటీల విషయానికి వస్తే, విజయనగరం జిల్లా రాజాం మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా బనిశెట్టి సౌజన్య లత బరిలో నిలవనున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మున్సిపాలిటీ ఛైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ చుండూరి మల్లేశ్వరి, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ ఛైర్మన్ అభ్యర్థిగా పాలూరు వెంకటేశ్వరరావు పేర్లను పార్టీ నాయకత్వం ఖరారు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున సమర్థులైన నేతలను బరిలోకి దించే క్రమంలో క్షేత్రస్థాయి సమీక్షలు నిర్వహించి, పార్టీ శ్రేణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే అధినేత పవన్ కల్యాణ్ ఈ అభ్యర్థులను ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అభ్యర్థుల ప్రకటనతో ఆయా నియోజకవర్గాల్లో జనసేన పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచారానికి సమాయత్తమవుతున్నాయి.

హరీశ్ రావు తండ్రి సంవత్సరీకానికి
హాజరైన కేసీఆర్, కేటీఆర్

- శ్రద్ధాంజలి ఘటించిన గులాబీ బాస్, కేటీఆర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన మేనల్లుడు హరీశ్ రావు నివాసానికి వెళ్లారు. హరీశ్ రావు తండ్రి దివంగత సత్యనారాయణరావు ప్రథమ వర్ధంతి (సంవత్సరీకం) సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. రంగారెడ్డి జిల్లా నార్సింగి సర్కిల్ పరిధిలోని కోకాపేటలో ఉన్న హరీశ్ రావు స్వగృహానికి కేసీఆర్ చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సత్యనారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం హరీశ్ రావుతో పాటు ఆయన కుటుంబ సభ్యులను కేసీఆర్ పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాల్గొన్నారు. ఆయన దివంగత సత్యనారాయణరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి శ్రద్ధాంజలి అర్పించారు. వీరితో పాటు రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితర ముఖ్య నేతలు హాజరై హరీశ్ రావు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సీఎం చంద్రబాబును కలిసిన వైఎస్ షర్మిల

- కుమార్తె వివాహానికి ఆహ్వానం



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్వయంగా కలిశారు. తన కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహ మహోత్సవానికి హాజరుకావాల్సిందిగా కోరుతూ ఆయనకు వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. చంద్రబాబు నివాసానికి వెళ్లిన ఆమె, పెళ్లి కార్డును అందించి నూతన వధూవరులను ఆశీర్వదించాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా తన కుమార్తె అంజలి రెడ్డి, కాబోయే అల్లుడు సోమల రఘురామ్ రెడ్డిల వివాహానికి సంబంధించిన వివరాలను చంద్రబాబుకు షర్మిల వివరించారు. పెళ్లికి తప్పనిసరిగా విచ్చేయాలని ఆమె కోరారు. సీఎం చంద్రబాబును కలిసిన అనంతరం వైఎస్ షర్మిల ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. చంద్రబాబుకు వెడ్డింగ్ కార్డు అందజేస్తున్న ఫొటోను పోస్ట్ చేస్తూ "ముఖ్యమంత్రి చంద్రబాబు గారిని తన నివాసంలో కలిసి నా కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి – సోమల రఘురామ్ రెడ్డి ల వివాహ మహోత్సవానికి విచ్చేసి కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ వివాహ ఆహ్వాన పత్రికను అందించడం జరిగింది" అని పేర్కొన్నారు. కుమార్తె వివాహాన్ని ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్న వైఎస్ షర్మిల, రాజకీయాలకు అతీతంగా పలువురు ప్రముఖులను స్వయంగా కలిసి ఆహ్వానిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డితో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖులకు ఆమె వివాహ ఆహ్వాన పత్రికలను అందజేశారు. తాజాగా ఏపీ సీఎం చంద్రబాబును కలిసి ఆహ్వానించడం ప్రాధాన్యత సంతరించుకుంది. షర్మిల కుమార్తె వివాహం నవంబరు 25న జరగనుండగా, డిసెంబరు 5న రిసెప్షన్ నిర్వహించనున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588